హైదరాబాద్ వార్త



## న్యూయర్ మన పండుగ కాదు...మన పండుగ ఉగాది : ఎమ్మెల్యే రాజాసింగ్

**గోషామహల్,డిసెంబర్ 31(ప్రభాతవార్త):** ఆంగ్ల నామా సంవత్సరం మన పండుగ కాదని ,మన హిందువుల పండుగ ఉగాది అని, అంగ్లనా మా సంవత్సరాన్ని విస్మరించాలని హిందువులకు గోషామహల్ నియోజకవర్గం బిజెపి శాసనసభ్యులు టి.రాజాసింగ్ పిలుపునిచ్చారు.జనవరి 1వ అర్ధరాత్రి పండుగా ఆంగ్లనామ సంవత్సరమని, అర్ధరాత్రి వేళ్ల రాక్షస్యులు జరుపుకుంటారన్నారు.అలాంటి ఆంగ్లనామ సంవత్సరాన్ని బ్రిటిషు పాలకులు మన హిందువులకురుద్దినట్లు ఆరోపిం చారు.ఆల పాశ్చాత్యా సంస్కృతిన్ని హిందువులు వదిలి వేయాలన్నారు.కొత్త సంవత్సరం పేరుతో గోవాకు,పబ్‌లకు,క్లబ్‌లకు వెళ్లడం వంటివి మన సంస్కృతి కాదన్నారు.కొత్తసంవత్సరం పేరుతో మన భవిష్యత్తుతరాలకు మన హిందువులు విదేశీ సంస్కృతిని అలవాటు చేయడం పట్ల రాజాసింగ్ వ్యతిరేకించారు.జనవరి 1 వేడుకల పేరుతో హిందువులు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.ఇప్పటికైనాహిందువులు ఉగాది పండుగా కొత్త సంవత్సరాన్ని అత్యంత వైభవంగా జరుపుకుని, మన భావితరాలకు మంచిసందేశాన్ని ఇచ్చి హిందు సంస్కృతిని అలవాటు చేయాలని రాజాసింగ్ హిందువులకు పిలుపునిచ్చారు.తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను బయటకు పంపవద్దన్నారు.ఈకార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.



# ఆనందహేల..మిన్నంటిన సంబరాలు

**-కొత్త ఏడాదికి స్వాగతం పలికిన నగరవాసులు**

**-పోలీసుల నిబంధనలు పట్టించుకోని జనం**

**-కిటకిటలాడిన మద్యంషాపులు**







**హైదరాబాద్,డిసెంబరు 31,ప్రభాతవార్త:** ఉత్సహం ఉప్పొంగింది..ఉల్లాసం ఉరకలెత్తింది.. నూతన సంవత్సర వేడుకల్లో జోష్ జోరందుకుంది. 2025కి నగర జనం సాదర స్వాగతం పలికారు. మంగళవారం అర్థరాత్రి ఒంటిగంటవరకు వేడుకలతో నగరమంతా హోరెత్తిపోయింది. రాత్రి 12కావడంతోనే ఒక్కసారిగా యువతీయువకులు జాతీయ జెండాలతో రహదారుల పైకి పరుగులు తీసారు. వినువీధుల్లో జాతీయ జెండాలు రెపరెపలాడుతుండగా కొత్తసంవత్సరానికి స్వాగతం పలికారు. ఆనందోత్సాహాలతో కేరింతలు కొట్టారు.నగరమంతటా యువజనోత్సాహం వెల్లివిరిసింది.అందంగా అలంకరించిన రంగు రంగుల విద్యుద్దీపాలు,బాణాసంచా వెలుగులు జిలుగులు నగరానికి కొత్తకాంతులను అద్దాయి. మరోవైపు అర్థరాత్రి దాటిన తర్వాత కూడా రహదారులపై అనేక చోట్ల రద్దీనెలకొంది. ట్యాంక్‌బండ్, నెక్లెస్‌రోడ్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, హైటెక్‌సిటీ, మాదాపూర్, తార్నాక, కూకట్‌పల్లి మియాపూర్, అమీర్‌పేట్, ప్రాంతాల్లో యువతీయువకులు రోడ్లపైకి వచ్చి ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రంగులు చల్లుకున్నారు. నగరంలోని అన్ని హోటళ్లు,పబ్బులు, క్లబ్బులు,బార్‌అండ్ రెస్టారెంట్‌లు సంగీత నృత్యోత్సవాలతో హోరెత్తాయి. డీజెలు సృష్టించిన సంగీత హోరులో నగరవాసులు తడిసి ముద్దయా్యరు. నగరవాసులు కొందరు కుటుంబాలతో తరలివెళ్లి శివార్లలోని రిసార్టుల్లో నూతన సంవత్సర వేడుకల్ని ఘనంగా నిర్వహించుకున్నారు. కొత్తసంవత్సరవేడుకల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టిబందోబస్తును ఏర్పాటు చేశారు. నగరంలోని అన్నిప్లైఓవర్‌లను మూసివేసారు.విస్తృతంగా డ్రంకెన్ డ్రైవ్‌లు ఎక్కడికక్కడ కట్టుదిట్టమైన బందోబస్తును నిర్వహించారు.

**కొనుగోలు దారులతో కిటకిటలాడిన బేకరీలు..**

న్యూఇయర్ వేడుకల సందర్భంగా నగరంలోని బేకరీలన్నీ కిటకిటలాడాయి. బిర్యానీ సెంటర్లు..బేకరీలముందు భారీగా క్యూలైన్లు దర్శనమిచ్చాయి. నగరవ్యాప్తంగా పలు బేకరీలు ముందు కౌంటర్లు ఏర్పాటు చేసి వేలసంఖ్యలో కేకు అమ్మకాలు జరిపారు.విభిన్న రకాలుగా తయారుచేసిన కేక్‌లను కొనేందుకు యువత ఉత్సాహం చూపించారు. డిసెంబరు 31నేపథ్యంలో బేకరీల నిర్వాహకులు వారంరోజుల ముందునుండే ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

**ఏరులై పారిన మద్యం..**

న్యూఇయర్ ఈవెంట్లు,పబ్బులు,ఫాంహౌస్‌ల్లో ప్రత్యేక కార్యక్రమాలు ఉండటంతోపాటు బార్లు,వైన్స్,షాపులకు ఆర్థరాత్రి వరకు పర్మిషన్ ఇవ్వడంతోనే గ్రేటర్‌లో మద్యం అమ్మకాలు జోరుగాసాగాయి. గత ఏడాదికంటే ఎక్కువశాతమే అమ్మకాలు జరిగాయని ఎక్సైజ్ అధికారులు తెలుపుతున్నారు. గ్రేటర్ పరిధిలో 350 మద్యం దుకాణాలు 246 బార్లు ,25 పబ్‌లు ఉన్నాయి. గత నాలుగు రోజులుగా గ్రేటర్ పరిధిలోని మద్యం దుకాణాలు,బార్‌లలో అమ్మకాలు రెట్టింపయ్యాయని. సాధారణ రోజుల్లో మద్యం అమ్మకాలు తక్కువగా ఉన్నా ఆది, సోమ, మంగళ వారాల్లో ఎక్కువగా జరిగాయని వ్యాపారులు తెలుపుతున్నారు. న్యూఇయర్ సందర్భంగా అదనపు సమయం ఇచ్చిన నేపథ్యంలో అమ్మకాలు జోరుగా సాగాయి. గ్రేటర్ పరిధిలోని దుకాణదారులకు గంట వెసులు బాటు బాగ కలిసొచ్చింది. ఈఅదనపు గంటలోనే అత్యధిక అమ్మకాలు సాగినట్లు పలువురు వ్యాపారులు అంటున్నారు.అర్థరాత్రి వరకు చాలామంది మందుబాబులు బార్లు, రెస్టారెంట్లలో బారులుతీరారు. పాత సంవత్సర చివరి రోజైన మంగళవారం మద్యాహ్నం నుండే చాలామంది మందుబాబులు బార్లలో, వైన్స్‌ల్లో కనిపించారు..మద్యం తాగే దుకాణాల దగ్గర అన్ని వసతులతో కూడిన గదులు, రకరకాల ఫుడ్ఐటమ్ ఆఫర్లు ప్రకటించడంతో ఎక్కువమంది బార్లు రెస్టారెంట్లలోనే కనిపించారు.ఈసారి 120కోట్లకు పైగానే అమ్మకాలు జరిగినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.






## వాళ్లు.. సోషల్ మీడియా ఆర్మీలు..!

**-టెస్ట్‌ల్లో భారత జట్టు పేలవ ప్రదర్శనపై సిపి సివి ఆనంద్ కామెంట్**



**హైదరాబాద్, డిసెంబరు 31 ప్రభాతవార్త** ఇటీవల టెస్టుల్లో టీమ్ ఇండియా పేలవ ప్రదర్శన చేస్తున్న సంగతి తెలిసిందే. స్వదేశంలో కివీస్ చేతిలో వైట్‌వాష్‌కు గురైన భారత జట్టు.. ప్రస్తుతం ఆస్ట్రేలియాలో జరుగుతున్న బోర్డర్ గావస్కర్ ట్రోఫీ సిరీస్‌లోనూ విఫలమవుతోంది. తొలి టెస్టులో మినహా తర్వాత జరిగిన మ్యాచ్లో నిరాశే ఎదు రైంది. నాలుగు టెస్టులు ముగిసేసరికి 2-1తో వెనకబడి ఉంది. బ్యాటింగ్‌లో విఫలమవడం, ముఖ్యంగా టాపార్డర్‌లోనూ స్టార్ ఆటగాళ్లు నిరాశ పరుస్తుండటం టీమ్ ఇండియాను దెబ్బతీస్తోంది. ఈనేపథ్యంలో భారత జట్టు పేలవ ప్రదర్శన చేయడంపై మీ అభిప్రాయం తెలుసుకోవాలని ఉందని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్‌ను ట్విటర్ (ఎక్స్)లో నెటిజన్లు అడిగారు. దీనికి ఆయన సమాధానాలు ఇచ్చారు. ప్రత్యర్థి జట్టు 11 మంది తో ఆడుతుంటే భారత జట్టు కేవలం 9 మంది తోనే ఆడుతుందని వ్యంగ్యంగా అన్నారు. 'ప్రత్యర్థి జట్టు 11 మందితో ఆడితే భారత్ కేవలం 9 మంది ఆటగాళ్లతో ఎలా పోటీపడుతుంది!? అగ్రశ్రే ణి జట్ల చేతిలో దారుణంగా ఓడుతున్నాం. ఈ విషయాన్ని జీర్ణించుకోవడం చాలా కష్టం. గత ఆస్ట్రేలియా పర్యటనలో స్టార్ ఆటగాళ్లు లేకుండా టీమ్ ఇండియా చాలా బాగా ఆడింది, గెలిచింది! ఇద్దరు అగ్రశ్రేణి ఆటగాళ్లు..నేను పేరు పెట్టడం మానేస్తాను ఎందుకంటే వారి "సోషల్ మీడియా ఆర్మీలు" నన్ను పిచ్చిగా ట్రోల్ చేస్తాయి. వారికేదో అత్యవసరమైన పని ఉన్నట్లు ఇలా వెళ్లి అలా హడావుడిగా వచ్చారు. స్టార్ ఆటగాళ్లంటే అవస రమైనప్పుడు మంచి ప్రదర్శన చేసి అభిమానుల్లో తమ ఆదరణ ఏమాత్రం తగ్గకుండా చూసుకోవాలి' అని ఓ నెటిజన్కు సీవీ ఆనంద్ రిప్లై ఇచ్చారు. "భారత జట్టు ఎదుర్కొంటున్న పరాభవాలను చూసి నేను మౌనంగా ఉండిపోయాను. టీమ్ ఇండియా చాలాకాలంగా కేవలం 9 మంది ఆట గాళ్లతోనే ఆడుతోంది. క్రికెట్‌కు ఎంతగానో ఆదరణ ఉన్న దేశం ఈ భారాన్ని మోయడం న్యాయ మా? ఆ స్టార్ ఆటగాళ్ల సోషల్ మీడియా ఆర్మీలు ఎవరైనా తమకు వ్యతిరేకంగా ఏదైనా మాట్లాడి నప్పుడల్లా నిర్ధాక్షిణ్యంగా దాడి చేస్తాయని సీవీ ఆనంద్ మరో నెటిజన్కు సమాధానమిచ్చారు.

## సూడాన్ చిన్నారికి పునర్జన్మనిచ్చిన నీలోఫర్ వైద్యులు



**హైదరాబాద్, డిసెంబరు 31,ప్రభాతవార్త:** సుడాన్ దేశానికి చెందిన ఓపసి బిడ్డకు హైదరాబాద్‌లోని నీలోఫర్ హాస్పిటల్ డాక్టర్లు పునర్జన్మను ప్రసాదించారు. అత్యంత విషమ పరిస్థితుల్లో ఉన్న బాబుకు ట్రీట్‌మెంట్ అందించి, రోగాన్ని పూర్తిగా నయం చేశారు. సుమారు నెల రోజుల పాటు నీలోఫర్‌లో పూర్తి ఉచితంగా వైద్యం అందించారు. సుడాన్ దేశానికి చెందిన దంపతులు ఐవీఎఫ్ ద్వారా బిడ్డను కనేందుకు ఏడాది క్రితం హైదరాబాద్‌కు వచ్చారు. ఇక్కడి ఓ కార్పొరేట్ హాస్పిటల్‌లో ఐవీఎఫ్ చేయించుకోగా, నెల రోజుల క్రితం మహిళ మగ పిల్లాడికి జన్మనిచ్చింది. బాబుకు పుట్టుకతోనే బ్లడ్ ఇన్ఫెక్షన్, బ్రెయిన్ ఇన్ఫెక్షన్ ఉన్నట్టుగా డాక్టర్లు గుర్తించారు. లంగ్స్‌లోనూ సమస్య ఉన్నట్టుగా తేల్చారు. బాబు పరిస్థితి విషమంగా ఉండడంతో 6రోజుల పాటు ఐసీయూలో ఉంచి ట్రీట్‌మెంట్ అందించారు. సుడాన్ దంపతుల వద్ద డబ్బులు పూర్తిగా అయిపోవడంతో, బాబును నీలోఫర్‌కు రిఫర్ చేశారు. ఆ బాబును అడ్మిట్ చేసుకున్న నీలోఫర్ డాక్టర్లు, నెల రోజుల పాటు పూర్తి ఉచితంగా చికిత్స అందించారు. బాబు తల్లిదండ్రులకు భోజన వసతి ఏర్పాటు చేశారు. బాబు పూర్తిగా కోలుకోవడంతో, మంగళవారం డిశ్చార్జ్ చేశామని నియొ నాటలజిస్ట్, డాక్టర్ స్వప్న తెలిపారు. తన బిడ్డకు బతికించిన డాక్టర్లకు సుడాన్ మహిళ (43 ఏండ్లు) కృతజ్ఞతలు తెలియజేశారు. తనకు ఇప్పటికే 5 సార్లు అబార్షన్ అయిందని, ఎన్నో ఏండ్లు పిల్లల కోసం తపించామని ఆమె తెలిపారు. ఐవీఎఫ్ ద్వారా పిల్లల్ని కనే అవకాశం ఉందని తెలిసి హైదరాబాద్‌కు వచ్చామన్నారు. అయితే, డెలివరీ తర్వాత బాబు పరిస్థితి విషమించిందని, చావు బతుకుల్లో ఉన్న తన బిడ్డకు నీలోఫర్ వైద్యులు పునర్జన్మను ప్రసాదిం చారన్నారు. విషమ పరిస్థితిలో ఉన్న బాబుకు ట్రీట్‌మెంట్ అందించిన డాక్టర్ల బృందాన్ని, హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ రవి కుమార్, హల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ఆర్‌వి. కర్ణన్ అభినందించారు.




## ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

**ధర్నాచౌక్, డిసెంబర్ 31, ప్రభాతవార్త:** గత 19 సంవత్సరాలుగా సేవలు అందిస్తున్న ఆశా వర్కర్ల సమస్యలు ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సీఐటియూ అఖిల భారత అధ్యక్షురాలు హేమలత డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియూ) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ఆశాల రాష్ట్ర బస్సు జాతా ముగింపు సభ ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిధిగా హాజరై హేమలత మాట్లాడుతూ రాత్రనక, పగలనకా ప్రజలకు సేవలు అందిస్తున్న ఆశాల శ్రమను ప్రభుత్వం గుర్తించటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పారితోషికం లేని అనేక పనులను ప్రభుత్వం ఆశాలతో చేయిస్తోందని, ఆశాలు చేస్తున్న పనులన్నింటినీ పరిగణలోకి తీసుకుని, పెరిగి ధరలకు అనుగుణంగా ఫిక్సెడ్ వేతనం 18వేలుగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ఆశాల హక్కు లను బీజేపీ ప్రభుత్వం కాలరాస్తోందని ధ్వజమెత్తారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక 45వ ఐఎల్‌సీ సిఫారసులు అమలు చేయకపోవటం వల్ల దేశవ్యాప్తంగా పదిలక్షల మంది ఆశాలు నష్టపోతున్నారని, కరోనా సమయంలో ఆశాలు చేసిన సేవల ను డబ్ల్యూహెచ్‌ఓ గుర్తించి, ఆశాలకు గ్లోబల్ లీడర్స్ అని అవార్డు ఇచ్చినప్పటికీ కేంద్రప్రభుత్వం మాత్రం గుర్తించటం లేదని ఆరోపించారు. సీఐటియూ రాష్ట్ర నాయకులు పాలడుగు భాస్కర్, ఎస్.రమ మాట్లాడుతూ ఆశాలను కార్మికులుగా గుర్తించాలని, కనీస వేతనం, పిఎఫ్, ఇఎస్ఐ వంటి సమస్య లు పరిష్కరించాలని 2015లో 106రోజులు ఆశాలు సమ్మె చేశారని గుర్తు చేశారు.




బస్సు జాతీ ముగింపు సభలో ప్రసంగిస్తున్న సీఐటియూ అఖిల భారత అధ్యక్షులు హేమలత

ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశాలకు ఫిక్సెడ్ వేతన చెల్లిస్తామని చెప్పి, మోసం చేస్తూ పనిని బట్టి పారితోషికాలను నిర్ణయం చేశారని అన్నారు. సీఐటియూ ఆధ్వర్యంలో ఆశాలు చేసిన పోరాట ఫలితంగానే నేడు 9,900 పారితోషికాలను తీసుకోగలుగుతున్నామని, ఈ పారి తోషికాలను పెరిగిన ధరలకు అనుగుణంగా 18వేలకు పెంచే విధంగా పోరాడి సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటియూ నేతలు కే.ఈశ్వరరావు, జే.వెంక టేష్, యూనియన్ అధ్యక్షులు పి.జయలక్ష్మి, ఆర్.నీలాదేవి, కాను మాధవి, సి.గంగమణి మరియు తెలంగాణ వ్యాప్తంగా వివిధ జిల్లాల నుండి వచ్చిన ఆశాలు పాల్గొన్నారు.

## నూతన సంవత్సరానికి శ్రీవారి ఆలయాలు ముస్తాబు

**చిక్కడపల్లి, డిసెంబర్ 31 ప్రభాతవార్త:** చిక్కడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి వారిని 2025 నూతన సంవత్సరంను పురస్కరించుకుని దేవాలయాలను బుధవారం పెద్దసంఖ్యలో భక్తులు వచ్చేఅవకాశం ఉన్న దృష్ట్యా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవడం జరిగిందని ఆలయం వ్యవస్థాపక వంశీయులు జి.శ్రీనాథ్‌గౌడ్, సహాయ కమిషనర్ కె.రామాంజనేయులు వివరించారు. ఈ సందర్భంగా ఆలయం ఆవరణలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయానికి వచ్చే భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్‌లను ఏర్పాటు చేశారు. తెల్లవారుజామున నుంచే భక్తులు వచ్చే అవకాశం ఉన్న కారణంగా ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేశారు. కాగా ఆలయాన్ని విద్యుత్తుదీపాలను పెద్దఎత్తున అలంకరణలు చేశారు. కోవిడ్ నియమ నిబంధనలను ప్రతి ఒక్కరు పాటించాలన్నారు.

**ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లోని లక్ష్మీగణపతి దేవాలయంలో**

కాగా ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లోని శ్రీలక్ష్మీగణపతి దేవాలయంలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆలయానికి వచ్చే భక్తులకు అన్ని ఏర్పాటు పూర్తి చేసినట్లు ఆలయం ఈవో లక్ష్మారెడ్డి వివరించారు. ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు విధిగా నిర్వహిస్తామన్నారు.

**వివేక్‌నగర్ ఆంజనేయస్వామి దేవాలయంలో**

కాగా వివేక్‌నగర్ ఆంజనేయస్వామి దేవాలయంలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆలయానికి వచ్చే భక్తులకు అన్ని ఏర్పాటు పూర్తి చేసినట్లు ఆలయం పునర్‌నిర్మాణ కమిటీ చైర్మన్ సుధాకర్, మాచర్ల దేవనాథం వివరించారు.

## కొండాపూర్‌లో అగ్నిప్రమాదం...

**-మంటల్లో కాలిపోయిన గేటెడ్ కమ్యూనిటీలోని ఇళ్లు - భారీగా ఆస్థినష్టం**

**గచ్చిబౌలి, డిసెంబరు 31 ప్రభాతవార్త** నూతన సంవత్సర వేడుకల కోసం పిండి వంటలు చేసే క్రమంలో గ్యాస్ సిలిండర్ లీకేజీతో కొండాపూర్‌లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ అగ్నిప్రమాదంలో ఓ గేటెడ్ కమ్యూనిటీ అపార్టుమెంటులో ఉన్న ఇళ్లు మంటల్లో పూర్తిగా దగ్ధమైంది. కొండాపూర్ గెలాక్సీ అపార్టుమెంటులో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.కొండాపూర్‌లోని గెలాక్సీ గేటెడ్ కమ్యూనిటీ అపార్టుమెంటు ప్లాట్ నెంబరు 907లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సునీల్, అతని భార్య పృథ్వీ, కుమారుడు వెంకట సృజన్‌లతో పాటు ఓ వృద్దుడు నివాసం ఉంటున్నారు. కమ్యూనిటీలో నిర్వహిస్తున్న నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా ఫుడ్ స్టాల్ ఏర్పాటు చేసేందుకు మంగళవారం సాయంత్రం పృథ్వీ తమ ఇంట్లో పిండి వంటలు చేస్తుంది. ఈ క్రమంలో మరో సింగిల్ బర్నర్ స్టవ్ మీద వంటలు చేసేందుకు మరో సిలిండర్‌ను తీయగా, గ్యాస్ లీకేజీతో ఒక్కసారిగా గ్యాస్ ఎగిసిపడింది. అప్పటికే ఇంట్లో ఉన్న స్టవ్ వంటలు ఉండడంతో లీకైన గ్యాస్‌తో మంటలు అంటుకున్నాయి. మరో గదిలో ఉన్న భర్త సునీల్‌ను పిలువగా, ఇద్దరు కలిసి మంటలను ఆర్పివేసేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో సునీల్‌కు స్వల్ప గాయాలు కాగా, మంటలు అదుపులోకి రాలేదు. దీంతో లిఫ్టు వద్ద ఉన్న ఫిక్స్ ఫైర్‌తో ఆర్పేందుకు ప్రయత్నించినా మంటలు అదు పు కాలేదు. మంటలు అంతకంతకు పెరుగుతుండడంతో భార్య భర్తలు భయాందోళనతో తమ కుమా రుడు, ఇంట్లో ఉన్న వృద్దుడిని తీసుకొని బయటకు పరుగులు తీశారు. అనంతరం స్థానికుల సమా చారంతో మాదాపూర్ ఫైర్ స్టేషన్ సిబ్బంది సంఘటనా స్థలికి చేరుకొని గంటపాటు శ్రమించి మంట లను అదుపు చేశారు. కాగా అప్పటికే ఇంట్లో ఉన్న ఫ్రీజ్, వాషింగ్ మెషిన్, ఏసీలు, బెడ్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, గ్రీజర్, సామాగ్రి మొత్తం కాలి బూడిదయ్యాయి. మంటల కారణంగా అపార్టుమెంటు మొత్తం దట్టమైన పొగ అలుముకోగా, మిలిగిన ప్లాట్లలో చిక్కుకున్న దాదాపు 10మందిని అగ్నిమాపక సిబ్బంది రక్షించి కిందకు దించారు. అగ్నిప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం చోటుచేసుకోలేదని, భారీగా ఆస్థినష్టం జరిగిందని మాదాపూర్ ఫైర్ అధికారి ఎండి. అబ్దుల్ ఫజల్ తెలిపారు.



గెలాక్సీ అపార్టుమెంటులో ఎగిసిపడుతున్న మంటలు

## తల్లిపై బెంగతో కొడుకు ఆత్మహత్య

**అల్వాల్, డిసెంబరు 31 ప్రభాతవార్త:** తల్లి ఆకస్మాత్తుగా మరణించడంతో మనోవేదను గురైన కుమారుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన అల్వాల్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. అల్వాల్ సుభాష్‌నగర్‌లో నివసించిన అమృత ఐదు నెలలు క్రితం గుండె పోటుతో మరణించింది. తల్లి మరణాన్ని జీర్ణించుకోలేని ఆమె కుమారుడు భరత్(29) గత కొంత కాలంగా ఎవరితోనూ మాట్లాడకుండా ఒంటరిగా ఉండడం జరుగుతోంది. ఇదిలా ఉండగా సోమవారం ఇతను ఇంట్లో ఉరి వేసుకోడం జరిగింది. కొన ఊపిరతో ఉన్న భరత్‌ను చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించగా మంగళవారం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# స్వర గంభీరుడు కొంగర జగ్గయ్య


పురస్కారాలను ప్రదానం చేసిన దృశ్యం

**చిక్కడపల్లి, డిసెంబరు 31 ప్రభాతవార్త:** వాచకం లో స్పష్టత గళం లో గాంభీర్యం నటన లో సహజత్వం కొంగర జగ్గయ్య తెలుగు సినిమాకు వరం అని ప్రముఖులు పేర్కొన్నారు. మంగళ వారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ లోని గుండవరపు హనుమంత రావు కళా వేదిక పై మానస ఆర్ట్స్ థియేటర్స్ అధినేత రఘుశ్రీ, త్యాగరాయ గానసభ నిర్వహణ లో ప్రముఖ నటుడు కొంగర జగ్గయ్య 88వ జయంతి సందర్భంగా ఆయన పేరిట ప్రతిభ పురస్కారాలు ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్య క్రమంలో భాగంగా శ్రీ కృష్ణ రాయబారం పౌరాణిక నాటకం లో శయనదృశ్యం ప్రదర్శనలో నటించిన కిషోర్ కుమార్, శ్రీనివాస్, సురేంద్ర నాథ్ లకు ప్రతిభ పురస్కారాలు బహుకరించి ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ కవి టివి స్వామి మాట్లాడుతూ పౌరా ణిక పద్య నాటకాలు తెలుగు సంస్కృతి భాషా సంపద అన్నారు. సాహితీ కిరణం పత్రిక సంపాదకుడు పొత్తూరి సుబ్బారావు అధ్యక్షత వహించిన సభలో సంస్థ అధ్యక్షుడు రామచంద్రరావు స్వాగతం పలికారు కవి రాఘశ్రీ కార్యక్రమం నిర్వహించారు.

## కార్మికులకు సత్వర న్యాయం అందించడానికి న్యాయవాదుల పాత్ర ఎంతో ఉంది

**-కార్మిక శాఖ అదనపు కమిషనర్ డాక్టర్ గంగాధర్**


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న పారిశ్రామిక ట్రెబ్యునల్ చైర్మన్ కోకా రాధ, ప్రిసైడింగ్ ఆఫీసర్ జీవిఎన్.భరతలక్ష్మి , చిత్రంలో అసోసియేషన్ ప్రతినిధులు రఘురాంరెడ్డి తదితరులు

**చిక్కడపల్లి, డిసెంబరు 31 ప్రభాతవార్త:**
కార్మికులకు సంబంధించి సత్వర న్యాయం జరిగే విధంగా కృషి జరగాలని పారిశ్రామిక ట్రెబ్యునల్ చైర్మన్ కోకా రాధ, లేబర్ కోర్టు ప్రిసైడింగ్ ఆఫీసర్ జీవిఎన్.భరతలక్ష్మి అన్నారు. మంగళవారం బార్ అసోసియేషన్ ఆఫ్ లేబర్ కోర్టు అధ్యక్ష, ప్రధాన కార్య దర్శులు కె.రఘురాంరెడ్డి, ఎం.మధుసూధన్ ఆధ్వర్యంలో రూ పొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్-2025ను డాక్టర్ ఇ.గంగాధర్ ముఖ్యఅతిథిగా చైర్మన్ కోకా రాధ, ప్రిసైడింగ్ ఆఫీసర్ జీవిఎన్.భరతలక్ష్మి ఆవిష్కరించి ప్రసంగించారు. సుదూర ప్రాంతాల నుంచి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పేద కార్మికులకు మానవతాదృక్పథంతో న్యాయసేవలు అందించాలని న్యాయవాదులను కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎం.కిరణ్‌కుమార్, కోశాధికారి బి.కిరణ్‌కుమార్, లైబ్రేరియన్ ఎం.సుబ్రహ్మణ్యం, కార్యవర్గసభ్యుడు డి.సత్యనారా యణ తదితరులు పాల్గొన్నారు. వివిధ రకాల కేసులు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

## లోక్‌దళ్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

**సైఫాబాద్, డిసెంబరు 31 ప్రభాతవార్త:** నూతన సంవత్స రం-2025లో లోక్‌దళ్ పార్టీని రాష్ట్రంలో బలోపేతం చేసేందుకు కార్యకర్తలు, నాయకులు తీవ్రంగా కృషి చేయాలని, వచ్చే ఎన్నికలో పార్టీ పోటిచేస్తుందని భారత జాతీయ లోక్‌దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకటరాజేశ్వర్‌రావు కోరారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తేనే ప్రజలు లోక్‌దళ్ పార్టీలో చేరుతారని, ఈ విషయాన్ని నాయకు లు, కార్యకర్తలు దృష్టిలో ఉంచుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజేష్, ఆంజనేయులు, రహెముతుల్లా, మహ్మద్ భాషా, అంజయ్య పాల్గొన్నారు

## వెంకటేశ్వర స్వామి దేవాలయం నిర్మాణానికి విరాళం


ఆలయ కమిటీ సభ్యులకు విరాళాన్ని అందజేస్తున్న జెట్టి అద్వై

**నిజాంపేట్, డిసెంబర్ 31, ప్రభాతవార్త**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, నిజాంపేట మున్సిపల్ కార్పోరేషన్ పరిదిలోని మధురా నగర్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ అష్టలక్ష్మీ సమేత వెంకటేశ్వర స్వామి దేవాలయం నిర్మాణానికి భక్తులు ముందుకు రావడం ఆనందంగా ఉందని ఆలయ కమిటీ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. మంగళవారం మధురానగర్ కాలనీకి చెందిన జెట్టి అద్వై రూ.1,01116 చెక్కు ను ఆలయ కమిటీ సభ్యులకు అందజేయడంతో ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాతలు వస్తురూపేనా, ధన రూపేణా సహకరించి ఆలయ నిర్మాణంలో పాలుపంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు హేమంత్, విష్ణు వర్ధన్ రావు, లింగయ్య, రాంబాబు, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ


జానయ్యను సత్కరిస్తున్న హనుమంతరావు

**నిజాంపేట్, డిసెంబర్ 31, ప్రభాతవార్త**
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో మూడున్నర దశాబ్దాలుగా పనిచేస్తున్న బి.జానయ్య వయసురీత్యా ఉద్యోగ విరమణ చేసారు. వర్సిటీలో మంగళవారం ఏర్పాటు చేసిన పదవీ విరమణ సమావేశంలో రిజిస్ట్రార్ ఆచార్య హనుమంత రావు ముఖ్య అతిధిగా విచ్చేసి జానయ్యను సత్కరించారు. వారికి రావలసిన ఆర్థికపరమైన సొమ్మును చెక్కు ద్వారా అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగి తాను ఎంత కాలం పనిచేసాన్నది ముఖ్యం కాదని తన సంస్థకు ఎంత మేరకు సేవలందించాననే సంతృప్తి కలిగితే చాలునని అన్నారు. ఉద్యోగులు తమ విధులను, బాధ్యతలను గుర్తెరిగి పనిచేస్తేనే తన వృత్తి ధర్మాన్ని పాటించినవారు అవుతారని గుర్తు చేసారు. జానయ్యకు పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో విశ్వవిద్యాలను ఉద్యోగ సంఘాల నాయకులు, వివిధ శాఖల అధిపతులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# కార్మికుల హక్కుల సాధన కోసం ఐఎన్‌టియుసి కీలక పాత్ర


సంజీవరెడ్డిని సత్కరిస్తున్న మొగళ్ళ రాజిరెడ్డి, సురేష్‌బాబు

**సైఫాబాద్, డిసెంబరు 31 ప్రభాతవార్త:** శ్రామిక వర్గానికి బలీయమైన గొంతుకైనా ఐఎన్‌టియుసిని బలోపేతం చేయడానికి కృషి చేయాలని కార్మిక వర్గానికి ఐఎన్‌టియుసి జాతీయ అధ్యక్షుడు జి.సంజీవరెడ్డి పిలుపునిచ్చారు. హక్కులు సాధించడం కోసం, శక్తివంతమైన సాధనంగా ఐఎన్‌టియుసి నేడు దేశంలో కిలకపాత్ర పోషిస్తున్నదని స్పష్టం చేశారు. వివిస్టీ గుర్తింపు కార్మిక సంఘంకు జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన జి.సంజీవరెడ్డిని హైదరాబా ద్ జిల్లా ఐఎన్‌టియుసి కార్యవర్గం మంగళవారం కార్యాల యంలో ఘనంగా సత్కరించిన సందర్భంగా మాట్లాడారు. కార్మికుల శ్రమకు తగ్గ వేతనాలు, మెరుగైన పరిస్థితులు, సామాజిక న్యాయం అందించడానికి గత కే ంద్ర కాంగ్రెస్ ప్రభుత్వాలు 44 కార్మిక చట్టాలను తీసుకువచ్చి అమలు చేసిందని, నేడు అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఆ చట్టాలను 4 కోడ్‌లుగా చేసి యాజమాన్యాలకు అనుకూ లంగా వ్యవహరిసు_న్నదని ఆరోపించారు. ఐఎన్‌టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జలమండలి కంగర్ యూనియన్ అధ్యక్షుడు మొగళ్ళ రాజిరెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేం ద్రమోదీ కార్మిక విధానాల వల్ల కార్మికుల జీవన స్థితిలో అంతరాయం కలుగుతున్నదని ఆరోపించారు. విభిన్న రంగాలలోని కార్మికుల హక్కులు, సంక్షేమం, రక్షణకై ఐఎన్‌టియుసి అనేక పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి సురేష్‌బా బు, కార్యనిర్వాహక అధ్యక్షుడు రామరాజు, అసోసియేట్ అధ్యక్షుడు భూమయ్య తదితరులు జి.సంజీవరెడ్డిని ఘనంగా సత్కరించారు.

## జిహెచ్ఎంసి వద్ద బిజెపి కార్పొరేటర్ల నిరసన


నగరంలో వీధిదీపాలు వెలగడం లేదని ఆందోళన చేస్తున్న గోషామహల్ నియోజకవర్గం బిజెపి కార్పొరేటర్లు

**గోషామహల్,డిసెంబర్ 31ప్రభాతవార్త:** గ్రేటర్ హైదరాబా ద్‌లోని గోషామహల్ నియోజకవర్గంలో సక్రమంగా వీధిదీ పాలు వెలుగడంలేదని గోషామహల్ నియోజకవర్గానికి చెందిన బిజెపి కార్పొరేటర్లు రాకేష్‌జైస్వాల్,డాక్టర్ సురేఖ ఓంప్రకాష్‌బిస్వా,శశికళకృష్ణలతోపాటు బిజెపి నాయకులు కృష్ణ,నరహరి,రమేష్,నితిన్,అరవింద్,సందీప్,హరినాథ్‌ల తోకలసి ట్యాంక్‌బండ్‌లోని కమీషనర్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున్న ఆందోళన చేశారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మహనగరంలో గోషామహల్ నియోజకవ ర్గంలోని పలు డివిజన్‌లల్లో గత కొద్ది నెలల నుంచి వీధిదీ పాలు వెలుగడంలేదని ఆందోళన వ్యక్తంచేశారు.రాత్రి వేళ్ల వీధిదీపాలు వెలుగక పోవడంతో వాహనాదారులు,ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నట్లు చెప్పారు.జిహెచ్ఎంసి ఎలక్ట్రిక్ విభాగంగా వీధి దీపాలు వెలుగచడంపూర్తిగా నిర్ల క్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు దుయ్యబట్టారు.వీధిదీపాలు వెలుగక పోవడం మూలంగా వీధి కుక్కలురాత్రి వేళ్లలో వాహనాలపై వెళ్లే వాహనాదారులపై దాడులకు గురిచే స్తున్నట్లు చెప్పారు.అనేక మంది వీధికుక్కల బారీన పడిన దాఖాలు ఉన్నట్లు ఆరోపించారు.ఇప్పటికైనా రాత్రివేళ్లలో వీధిదీపాలు వెలిగే విధంగా చూడాలని గ్రేటర్‌హైదరాబాద్ మున్సిపల్ కమీషనర్‌తోపాటు మేయర్‌ను డిమాండ్ చేశారు.ఆందోళన చేస్తున్న కార్పొరేటర్లు, బిజెపి నాయకు లను పోలీసులు అదుపులోకి బోలారం పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.ఈకార్యక్రమంలో బిజెపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆహ్లాదానికి నెలవుగా పార్కుల సుందరీకరణ : జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి

**శేరిలింగంపల్లి, డిసెంబర్ 31 ప్రభాతవార్త**
ఆహ్లాదానికి నెలవుగా పార్కుల సుందరీకరణకు ప్రణాళికాబ ద్ధంగా కృషిచేస్తున్నట్లు శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి అన్నారు. ఐటీ పరిశ్రమలు అధికంగా ఉన్న శేరిలింగంపల్లి జోన్‌లో మాల్స్,హాల్స్‌కు ప్రత్యామ్నాయం గా ఆహ్లాదాన్ని అందించేలా పార్కులను తీర్చిదిద్దుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్ పరిధిలోని పలు పార్కులను జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, అధికా ర బృందంతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అద్భుతమైన థీమ్‌లతో రూపొం దించిన పార్కులు జోన్‌కే ప్రత్యేకంగా నిలుస్తున్నాయ న్నారు. వాటి స్ఫూర్తితోనే కాలనీల లోని పార్కులను పూర్తి స్థాయిలో సుందరీకరిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. వాకింగ్ ట్రాక్,చిన్నారులకు ఆటపరికరాలు, పచ్చదనం ,ప్రహారీగోడలపై అందమైన,వ్యాయామానికి స్ఫూర్తినిచ్చే చిత్రాల పేయింటింగ్ చేపడుతున్నామన్నారు. కాలనీలలోని ప్రతి పార్కును సుందరంగా తీర్చిదిద్దటం ద్వారా ఉదయం, సాయంత్రం వేళల్లో కాలనీ వాసులు ఆహ్లాదం కోసం సేదదీరేలా పార్కులను అందుబాటులోకి తీసుకువస్తున్నా మని జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి తెలిపారు. కాపూరి హిల్స్ పార్కులో మరమ్మత్తుల వేగం పెంచాలని, కాలనీ లో ఎస్‌బీఐ బ్యాంకు సమీపంలో అదనంగా పార్కు అభివృ ద్ది కోసం అంచనాలు తయారు చేయాలని అధికారులకు ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న పార్కులకు తోడు అదనంగా ఏర్పాటుకు అవకాశం ఉన్నచోట తప్పకుండా పార్కులను నిర్మించి వాటిని సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. కాలనీ సంఘాలు సైతం పార్కుల పరిశుభ్రతపై దృష్టి కేంద్రీకరిం చాలని, పరిసరాలు దుర్వినియోగం కాకుండా చూసుకో వాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీ మోహన్‌రెడ్డి, ఈఈ కేవీఎస్ఎన్ రాజు, నాగిరెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


శేరిలింగంపల్లి జోనల్ పరిధిలో పార్కులను పరిశీలిస్తున్న జడ్‌సి ఉపేందర్‌రెడ్డి, అధికార బృందం

## మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం : డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి

**నార్సింగి, డిసెంబర్ 31 ప్రభాతవార్త :** బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యతను ఇచ్చామని డిప్యూటీ మేయర్ పూలంప ల్లి రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కార్పొరేషన్ పరిధిలోని హైదర్షాకోట్ శాంతినగర్‌లో నిర్మిస్తున్న సీసీ రోడ్లు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల వేళ ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని చేతల్లో చేసి చూపించామని వివరించారు. హైదర్షాకోట్‌లోని ప్రతీ గల్లిలో సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజి, మంచినీటి పైప్‌లైన్, వీధి దీపాలు వేయించామని తెలిపారు. బండ్లగూడ కార్పొరేషన్‌లో హైదర్షాకోట్ గ్రామం ను అభివృద్దిలో నెంబర్‌వన్‌గా నిలిపామని పేర్కొన్నారు. అలాగే స్మశాన వాటికలు, పార్కులు, కమ్యూనిటీహాళ్లు, ఓపెన్‌జిమ్‌లను ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చామన్నారు. ఎర్రకుంట చెరువు వద్ద కూడా అత్యంత సుందరమైన పార్కును, వాకింగ్ ట్రాక్‌ను, విశ్రాంతి భవన్‌ను నిర్మిస్తున్నామని, త్వరలోనే అది కూడా ప్రజలకు అందుబాటులో తీసుకు వచ్చేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని తెలిపారు. ఎవరు ఏ రకమైన అభివృద్ధి చేసినా మన ప్రాంతం అభివృద్ధి చెందడం అన్నది ముఖ్యమని, శాశ్వంతంగా నిలిచిపోయే అభివృద్ధి పనులు చేయించి ప్రజల మన్ననలు పొందేందుకు అహర్ని షలు పని చేస్తున్నామని డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. అభివృద్ధి పనులలో ఎక్కడా రాజీ పడలేద ని, కుల,మత,పార్టీలకు అతీతంగా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేశామని వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సందీప్ ముదిరాజ్, శివ తదితరులు ఉన్నారు.


హైదర్షాకోట్ శాంతినగర్ కాలనీలో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న బండ్లగూడ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పి.రాజేందర్‌రెడ్డి

## ప్రొఫెసర్ శ్రీరాములుకు ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రతిష్టాత్మక గ్లోబల్ సన్మానం

**తార్నాక, డిసెంబర్ 31 ప్రభాతవార్త:**
మేనేజ్‌మెంట్ ఫ్యాకల్టీ డీన్ సీనియర్ ప్రొఫెసర్ డి. శ్రీరాములుకు గ్లోబల్ పవ ర్ లీడర్ అవార్డు 2024 లభించిందని ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రక టించింది. ప్రొ.శ్రీరాము లు దార్శనిక రచనలు,


గ్లోబల్ పవర్ లీడర్ అవార్డును చూపిస్తున్న వైస్ చాన్స్‌లర్ ప్రొ.కుమార్ ఎం.ప్రొ.శ్రీరాములు

విద్యారంగం పట్ల అచంచలమైన అంకితభావాన్ని ప్రదర్శించారు. ఐకానిక్ న్యూ సౌత్ వేల్స్ పార్లమెంట్, సిడ్నీ, 12 డిసెంబర్ 2024న. అవార్డు వేడుకను వరల్డ్ కన్సల్టింగ్ అండ్ రీసెర్చ్ కార్పొరేషన్ ఇంటర్నేషనల్ (జూదిలిదివిగి) ది మాల్కం మెక్‌డొనాల్డ్ అకాడమీ సహకారంతో నిర్వహించింది. ఈ మేరకు వైస్‌ఛాన్సలర్ ఛాంబర్‌లో జరిగిన సమావేశంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ ప్రొ. కుమార్ మొలుగారంతో ప్రొ. డి. శ్రీరాములు ఈ స్మారక విజయాన్ని పంచుకున్నారు. తన అభినంద నలు తెలియజేస్తూ, ప్రొఫెసర్. కుమార్ మొలుగారం ఉస్మానియా విశ్వవిద్యా లయానికి అంతర్జాతీయ గుర్తింపు తెచ్చినందుకు ప్రొఫెసర్ శ్రీరాములును కొనియాడారు. ఈ అవార్డును "అద్భుతమైన విద్యా మైలురాయి మరియు మేనేజ్‌మెంట్ విద్యా రంగానికి ప్రొఫెసర్ శ్రీరాములు చేసిన అసమాన సేవలకు నిదర్శనం" అని పేర్కొన్నారు. ఈ మహత్తర కార్యక్రమంలో ప్రొఫెసర్ శ్రీరాము లుతో పాటు బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగానికి చెందిన సీనియర్ ప్రొఫెసర్ వై. జహంగీర్, విభాగాధిపతి, ప్రొఫెసర్ స్మిత సాంబ్రాణి, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్‌పర్సన్. హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రొఫెసర్ శ్రీరాము లు విశ్వవిద్యాలయం నాయకత్వం, అతని సహచరుల దృఢమైన మద్దతు మరియు ప్రోత్సాహానికి ఈ అసాధారణ గౌరవాన్ని అందించారు. వైస్‌ఛాన్స లర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగారం, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గద్దం నరేష్ రెడ్డి, ఓఎస్‌డికి, బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో అంకితభావంతో పనిచేసిన అధ్యాపకులతో పాటు వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎస్. జితేందర్ కుమార్ నాయక్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ గుర్తింపు ప్రొ. శ్రీరాములు యొక్క కృషిని నొక్కిచెప్పడమే కాకుండా ప్రపంచ వేదికపై ఉన్నత విద్యలో అత్యుత్తమ కేంద్రంగా ఉస్మానియా విశ్వవిద్యాలయం స్థానాన్ని బలపరుచడం సంతోషంగా ఉందని వారు తెలిపారు.

## పార్లమెంట్‌లో బిసి బిల్లుకు కృషి చేయండి

**-సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి రాజాకు గుజ్జకృష్ణ వినతి**


రాజాకు వినతిపత్రం ఇస్తున్న గుజ్జకృష్ణ, నందగోపాల్, ఉదయ్‌నేత తదితరులు

**హైదరాబాద్, డిసెంబరు 31,ప్రభాతవార్త:**
పార్లమెంట్‌లో బిసిబిల్లు పెట్టిచట్టసభల్లో బిసిలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించే విధంగా కేంద్రంపై ఒత్తిడి తేవాలని బిసిసంక్షేమసంఘం జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజాను కోరారు. ఈమేరకు హైదరాబాద్‌కు వచ్చిన రాజా నుమంగళవారం హిమాయత్‌నగర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా దేశవ్యా ప్తంగా బిసిలకు జరుగుతున్న అన్యా యాలను గుజ్జకృష్ణ వివరించారు. కేంద్రంలో బిసిలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ, జనగణనలో కులగణన, బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు, ఎస్సీ,ఎస్టీల మాదిరిగానే బిసిలకు బిసియాక్ట్ వంటి అంశాలపై చర్చించా రు. ఈకార్యక్రమంలో నాయకులు నం దగోపాల్, ఉదయ్‌నేత, రఘుపతి, తదితరులు పాల్గొన్నారు.

# గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తల్లారి మల్లేష్

**- వైస్ చైర్మన్‌గా కావలి చంద్రశేఖర్**
**-నూతన పాలకమండలి సభ్యులను ఘనంగా సత్కరించిన అధికారులు, వ్యాపారులు**


పాలకమండలి సభ్యులను ఘనంగా సన్మానించిన అధికారులు, వ్యాపారులు.

**మెహిదీపట్నం, డిసెంబర్ 31, ప్రభాతవార్త :** గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కొలువుదీరింది. నూతన పాలకమండలి చైర్మన్ గా రంగారెడ్డి జిల్లా గండిపేట మండల్ ఖానాపూర్ గ్రామానికి చెందిన తల్లారి మల్లేష్ నియ మితులైనారు. వైస్ చైర్మన్‌గా కావలి చంద్రశేఖర్‌లతో పాటు 12 మంది సభ్యులతో కూడిన పాలకమండలి మంగళవారం మార్కెట్ కార్యాలయంలో మార్కెట్ సెక్రటరీ శ్రీనివాస్ నాయ క్ ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలను స్వీకరిం చారు. 1. షేక్ మహమ్మద్ మునీర్ హమ్మద్, 2. కురవ పాండు, 3. జె. లక్ష్మారెడ్డి,4.బండారి శంకర్, 5. బొక్క ప్రహ్లాద్ రెడ్డి, 6. మహమ్మద్ అబ్దుల్ వసీం, 7. ఏ.గణేష్ రెడ్డి, 8.కె.మధుసూదన్ రెడ్డి, 9.గొంగడి ఓం ప్రకాష్ రెడ్డి, 10.ముంగి రఘుపాల్ రెడ్డి, 11.కె.జగన్నాథ్ రెడ్డి, 12.ఆర్. వెంకట్ రెడ్డి లు పాలకమండలి సభ్యులుగా నియమితులై నారు. ఈ సందర్భంగా చైర్మన్ తల్లారి మల్లేష్, వైస్ చైర్మన్ కావాలి చంద్రశేఖర్ లు మాట్లాడుతూ... రైతుల ప్రయోజనాలే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమన్నారు. రైతులను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి, మార్కెట్ అభివృద్ధికి పాలకమండలి అన్ని విధాలుగా కృషి చేస్తుందని తెలిపారు. గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నియామకానికి సహకరించిన నాయకులందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. అనంతరం గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ అధికారులతో పాటు వ్యాపారుల సంఘం ప్రతినిధులు పాలక మండలి సభ్యులకు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.

## కార్పొరేట్ విద్య, వైద్యం దోపిడిని అరికట్టాలి


ప్రసంగిస్తున్న బహుజన లెఫ్ట్ పార్టీ (బహుజన కమ్యూనిస్టు) బిఎల్‌పి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్

**చిక్కడపల్లి, డిసెంబరు 31 ప్రభాతవార్త:**
తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేట్ కార్పొరేట్ విద్య, వైద్య సంస్థల దోపిడిని అరికట్టాలని బహుజన లెఫ్ట్ పార్టీ (బహుజన కమ్యూనిస్టు) బిఎల్‌పి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ డిమాండ్ చేశారు. మంగళవారం బహూజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన రాష్ట్ర కమిటి సమావేశం లో ఆయన మాట్లాడుతూ తమది ప్రజా ప్రభుత్వమని చెపు తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ విద్య, వైద్య దోపిడిని అరికట్టడానికి ఒక ప్రత్యేక చట్టం చేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ప్రభుత్వ విద్య, వైద్యం సామాన్యులకు అందుబాటులోకి తేవాలని దండి వెంకట్ డిమాండ్ చేశారు. ప్రైవేట్ కార్పొరేట్ విద్య వైద్యం ప్రజల రక్తమాంసాలతో వేలాది కోట్ల రూపాయల లాభాలను పొందు తున్నారని తెలిపారు. విద్య వైద్య సంస్థల దోపిడిని అరికట్టాలని డిమాండ్ చేస్తూ ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమిం చాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర వ్యవస్థాపక మ అధ్యక్షులు నల్లా సూర్యప్రకాష్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ సిద్ది రాములు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సబ్బని లత, ఎంఎం. గౌడ్, ఎ.శ్రీశైలం, కార్యదర్శులు వద్ల సాయి కృష్ణ, ఎన్.ఎల్లన్న, రాష్ట్ర కోశాధి కారి మారోజు సునీల్ కుమార్ అజయ్,చాట్ల పోశవ్వ అరుణ, ఎస్.డి. మహిమూద్, సయ్యద్, సి.హెచ్.కళా అన్ని జిల్లాల రాష్ట్ర కమిటి సభ్యులు పాల్గొన్నారు.

## నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మంత్రి


నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**నిజాంపేట్, డిసెంబర్ 31, ప్రభాతవార్త**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్‌లోని శ్రీశ్రీశ్రీ ఎల్లమ్మ, నాగదేవత ఆలయ క్యాలెండర్‌ను సచివాలయంలోని తన చాంబర్లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదు గా మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని, సుఖ శాంతులతో ఉండే విధంగా చూడాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ ఎల్లమ్మ, నాగదేవత ఆలయ ధర్మకర్త మేకల నాగేష్, అబ్రహం, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పొట్టిశ్రీరాములు వర్సిటి పేరు మార్పును అడ్డుకోవాలని 11 రాష్ట్రాల ముఖ్యమంత్రులు,గవర్నర్లకు లేఖలు

**బేగంబజార్,డిసెంబర్ 31ప్రభాతవార్త:** ఉమ్మడి రాష్ట్రం కొరకు ప్రాణ త్యాగం చేసిన అమర జీవి పొట్టి శ్రీరాములుతెలుగు యూనివర్సిటికి పేరును మార్చవద్దని ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్‌గుప్త దేశ ప్రధాన మంత్రి,భారత రాష్ట్రపతికి,రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్య మంత్రులతోపాటు మరో 11 రాష్ట్రాల ముఖ్యమంత్రులకు లేఖలు రాసినట్లు తెలిపారు.ఈమేరకు ఒక ప్రకటన జారీ చేశారు.అంతేకాకుండా ఏఐసిసి అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే, పార్లమెంట్ కాంగ్రెస్ ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ ,హైదరాబాద్ పార్లమెంట్ సభ్యులు అసదుద్దీన్‌ఓవైసి, తెలంగాణ శాసనసభ మజ్లీస్ ప్రతిపక్ష నాయకులు అక్బరు ద్దున్ ఒవైసీలకు లేఖలు వ్రాసినట్లు బోనాలశ్రీనివాస్‌గుప్త తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం తెలుగు యూనివర్సిటికి పేరు మార్పుపై పునరాలోచన చేసే విధంగా ఒత్తిడి తీసుకురావాలని ఆయన కోరినట్లు తెలిపారు.

## డ్రైనేజీ పనులు త్వరగా పూర్తి చేయాలి : తోకల శ్రీనివాస్ రెడ్డి


మధుబన్‌కాలనీలో డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి తోకల శ్రీనివాస్‌రెడ్డి

**మైలార్‌దేవ్‌పల్లి,డిసెంబరు 31 ప్రభాతవార్త :** మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని మధుబన్‌కాలనీలో మంగళవారం అధికా రులతో కలిసి రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి తోకల శ్రీనివాస్‌రెడ్డి పాదయాత్ర జరిపారు.మధబన్ కాలనీలో డ్రైనేజీ పనులను ఆయన పర్యవేక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండ త్వర గా పనులు పూర్తి చేయాలని ఆదేశించటం జరిగిందని తెలిపా రు.కార్యక్రమంలో ఏఈ నరసింహమూర్తి,పార్కింగ్ ఇన్‌స్పెక్టర్ భాను,సూపర్ వైజర్ వినయ్,ముఖ్య నాయకులు బుచ్చిరెడ్డి, నరసింహారెడ్డి,ఉత్తం,యాదగిరి,కిరణ్,భూనతి రెడ్డి,రామ కృష్ణ,అభి నరసింహ,చందూ నాయక్ పాల్గొన్నారు.

## బహిరంగ ప్రదేశాల్లో చెత్తను కాల్చడం నిషేధం

**- నార్సింగి మున్సిపల్ చైర్ పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్**


కాలుష్య నియంత్రణ మండలి పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నార్సింగి మున్సిపల్ చైర్ పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్, కమీషనర్ కృష్ణమోహన్‌రెడ్డిలు.

**నార్సింగి, డిసెంబర్ 31 ప్రభాతవార్త :** బహిరంగ ప్రదేశాల లో చెత్తను కాల్చడం నిషేదించడమైందని నార్సింగి మున్సిపల్ చైర్ పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం నార్సింగి మున్సిపల్ కార్యాలయంలో కమీషన ర్ కృష్ణమోహన్‌రెడ్డితో కలిసి కాలుష్య నియంత్రణ మండలికి సంబంధించిన పోస్టర్లను ఆమె విడుదల చేశారు. ఈ సందర్భంగా నాగపూర్ణ మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో చెత్తను కాల్చడం వలన వాతావరణంలోకి విషతుల్యమైన వాయువులు కలిసి, కలుషితం అవుతుందని వివరించారు. దేశ రాజధాని ఢిల్లీవంటి నగరంలో ఇలాంటి పొగ వలన వాతావరణం పూర్తిగా కలుషితం అయ్యిందని, అలాంటి దుర్భర పరిస్థితులు మనవద్ద రాకుండా ఉండేందుకు ముందు జాగ్రత్తగా మన కాలుష్య నియంత్రణ మండలి చర్యలు తీసు కుంటుండడం అభినందనీయమన్నారు. ఇందుకు ప్రజలంద రూ సహకరించాలని, ఇక నుంచి నార్సింగి మున్సిపల్ పరిధిలో ఎక్కడా కూడా చెత్తను బహిరంగ ప్రదేశాల్లో కాల్చ వద్దని, ఎవరైనా కాలిస్తే రూ.5.వేల వరకు జరిమానా విధిం చడం జరుగుతుందని హెచ్చరించారు.కార్యక్రమంలో టిపిఎస్ మణిహారిక, నరేష్, శ్రీనివాస్, లచ్చిరాం పాల్గొన్నారు.

## కనుల పండువగా సాగిన అయ్యప్ప స్వామి మహపడి పూజ

**నార్సింగి, డిసెంబర్ 31 ప్రభాతవార్త :** గండిపేట మండలం గౌలిదొడ్డి గ్రామంలో దారుగుపల్లి ప్రభాకర్ గురుస్వామి ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన అయ్యప్ప స్వామి మహప డి పూజ కన్నుల పండువగా కొనసాగింది. ఉదయం 9.గంట ల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు ఆ ప్రాంతమం తా అయ్యప్ప నామ్మ స్మరణంతో మారుమ్రోగిపోయింది. ఆద్యాంతం గంగపుత్ర నర్సింగ్‌రావ్ భజన మండలి నేతృ త్వంలో సాగిన అయ్యప్ప భక్తిగీతాలపనలతో భక్తులు భక్తిసా గరంలో మునిగి తేలారు. గోపాల్ గురుస్వామి చేతుల మీదు గా సాంప్రదాయబద్దంగా ఈ పూజ నిర్వహించారు. పుర ప్రముఖులు, అయ్యప్ప స్వాములు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొ ని స్వామి కరుణా,కటాక్షాలకు పాత్రులయ్యారు. దారుగుపల్లి ప్రమీల-సత్యనారాయణలు అన్నదానం నిర్వహించారు.

## బిసి వర్గాల ప్రజలు తలెత్తుకుని బ్రతకాలి

**-మల్కాజిగిరి లోకసభ సభ్యుడు ఈటల రాజేందర్**


ఆదర్శకిరణం-2025 క్యాలెడర్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మల్కాజిగిరి లోకసభ సభ్యుడు ఈటెల రాజేందర్

**చిక్కడపల్లి, డిసెంబరు 31 ప్రభాతవార్త:** బీసీ వర్గాల ప్రజలు తలెత్తుకుని బ్రతకాలని మల్కాజిగిరి లోకసభ సభ్యుడు ఈటెల రాజేందర్ అన్నారు. ఆదర్శకిరణం-2025 క్యాలెడర్ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మల్కాజిగిరి లోకసభ సభ్యుడు ఈటెల రాజేందర్ ఆవిష్కరిం చి ప్రసంగించారు. ఆదర్శకిరణం సంపాదకుడు వంగాల బాలరాజ్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నా రు. బీసీలు బానిసలుగా బ్రతకకూడదని, ప్రశ్నించే తత్వాన్ని పోరాటంతో ఎత్తుకు ఎదగాలని అన్నారు. కార్యక్ర మంలో ఆదర్శ సంస్థల మేనేజర్ మంజులాగౌడ్, నిర్మల, ప్రొఫెసర్ డి.సాంబయ్య, న్యాయవాది అంజన్‌గౌడ్, చేనేతవ ర్గాల చైతన్యవవేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చిక్కాదేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

## కడుపు నొప్పి తాళలేక వ్యక్తి ఆత్మత్య

**అల్వాల్, డిసెంబరు 31 ప్రభాతవార్త:** కడుపు నొప్పితో బాద పడుతున్న ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన అల్వా ల్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన కేధార్‌నాథ్(69) బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి హస్మత్‌పేట్‌లోని ఓ కేటరింగ్ దుకాణంలో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. కడుపు నొప్పి వస్తుండడంతో ఆరు నెలలు క్రితం హెర్నియా ఆపరేషన్ చేయించుకున్నాడు. తిరిగి మరలా యాదావిదిగా నొప్పి రావడం ప్రారంభమైంది. నొప్పిని భరించలేని అతను సోమవారం రాత్రి కేటరింగ్ దుకా ణానికి సమీపంలోని షెడ్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇతనికి భార్య ఐదుగురు కొడుకులు ఉండగా వీరంతా ఉత్తర్‌ప్రదేశలోని స్వగ్రామంలోనే ఉంటున్నారు. పోలీసులు కేసు నమోలు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పివిఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వే పై కారు బీభత్సం

**అత్తాపూర్ డిసెంబరు31,ప్రభాతవార్త :**
పివిఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వే పై స్కోడా కారు బీభత్సం సృష్టించి న సంఘటన రాజేంద్రనగర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.పోలీసులు వివరాల ప్రకారం...రాజేంద్రనగర్ పరిధిలోని పివిఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వే పై వెళ్తున్న కార్లు వెనక నుండి స్కోడా కారు ఢీకొట్టింది.అయితే రెండు కారుల్లో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయలు అయ్యాయి.కార్లు ఎయిర్ బెలూన్స్ ఓపెన్ కావడంతఓ పెను ప్రమాదం తప్పిం ది.మితిమీరిన వేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు తెలిపారు.ఎక్స్‌ప్రెస్ వేపై భారీగా ట్రాఫిక్ జామ్ కావడంలో ట్రాఫింక్ పోలీసులు క్లియర్ చేశారు.ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## క్రిస్టియన్ గ్రేవ్ యార్డుకు స్థలం కేటాయించాలి : ఎమ్మెల్యే శ్రీగణేష్


సిఎం రేవంత్ రెడ్డితో బేటీ అయిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

**కంటోన్మెంట్,డిసెంబరు31 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ నియోజకవర్గంలోని క్రిస్టియన్ కమ్యూనిటీకి గ్రేవ్ యార్డు స్థలం కెటాయించాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో శ్రీ గణేష్ మాట్లాడుతూ కంటోన్మెంట్ నియోజకవర్గంలో క్రిస్టియన్ కుటుంబాలు అత్యధికంగా ఉన్నాయని,వారికి గ్రేవ్ యార్డు లేక సతమతమౌతున్నారని, గ్రేవ్ యార్డు స్థలం కోసం వివిధ చర్చీల ఫాస్టర్ల తన దృష్టికి తేవడం వల్ల ముఖ్య మంత్రికి విన్నవించుకున్నట్లు ఆయన తెలిపారు. అందుకు సిఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

**డిసిపి రష్మిపెరుమాల్‌తో సమావేశమైన ఎమ్మెల్యే శ్రీగణేష్ .**

కంటోన్మెంట్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో డ్రగ్స్,గంజాయి, అసాంఘీక కార్యకలాపాలను కట్టడి చేసేందుకు సీసీటీవీ కెమరాలను ఏర్పాటు చేయాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ మంగళవారం ఉత్తర మండలం డిసిపి సాధన రష్మిపెరుమాల్‌కు విజ్ఞప్తి చేశారు.

## అడ్డగుట్ట అభివృద్ధికి నిరంతరం కృషి : లింగాని ప్రసన్న


అడ్డగుట్టలో మంచినీటి పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న కార్పోరేటర్ లింగాని ప్రసన్న తదితరులు

**అడ్డగుట్ట,డిసెంబరు 31 ప్రభాతవార్త:** అడ్డగుట్ట డివిజన్‌లోని వివిధ ప్రాంతాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని డివిజన్ కార్పోరేటర్ లింగాని ప్రసన్న శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం అడ్డగుట్ట సి,డి సెక్షన్ కమాన్ నుంచి ఆర్‌ఆర్‌సీ గ్రౌండ్ వరకు ఏర్పాటు చేయనున్న మంచినీటి పైప్‌లైన్ నిర్మాణం పనులను అమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసన్న మాట్లాడుతూ సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ సహాయ సహకారాలతో పెండింగ్ పనులను దశల వారిగా చేపడుతున్నామన్నారు. దశాబ్దాల నుంచి పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. డివిజన్ ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తెచ్చినట్లైతే తక్షణమే పరిష్కరించి కృషి చేస్తామన్నారు. జలమండలి డిజిఎం విద్యా సాగర్, ఏఈ శ్రవంతి, బిఆర్ఎస్ నాయకులు లింగాని శ్రీనివాస్, సత్తయ్య గౌడ్, మనోహర్, పొన్నాల రాజు, కైరం కొండ యాదగిరి, అమర్, మహ్మద్, నర్సింగ్, మల్లేశ్, శివశంకర్, మహేందర్, శ్రీరామ్ నాయక్, ఎం.డి. ఇస్మయిల్, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

### మౌలిక వసతులు కల్పనే లక్ష్యం: కార్పొరేటర్ జితేందర్‌నాథ్


యుజిడి పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్

**అల్వాల్, డిసెంబరు 31 ప్రభాతవార్త:** ప్రజావసరాలకు మేరకు మౌలిక వసతులను కల్పిస్తున్నామని మచ్చబొల్లారం కార్పొరేటర్ జితేందర్‌నాథ్ తెలిపారు. మంగళవారం డివిజన్ పరిధిలోని భరత్‌నగర్,సామల లక్ష్మీ ఎన్‌క్లేవ్‌లో ఏర్పాటు చేయనున్న యుజిడి పనలకు కార్పొరేటర్ శంఖుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి నేతలు మల్లిఖార్జున్, వెంకటేష్, దేవందర్, సంధ్యారాణి, స్వరూప పాల్గొన్నారు.

### నూతన సంవత్సరంలో అనుకున్న కోర్కెలు నెరవేరాలి : జంపనప్రతాప్


బోయిన్‌పల్లి ప్లే గ్రౌండ్ వద్ద నూతన సంవత్సర కేక్ కట్ చేస్తున్న జంపనప్రతాప్ తదితరులు

**కంటోన్మెంట్,డిసెంబరు31 ప్రభాతవార్త:** 2025 నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరు కోరుకున్న కోర్కెలు నెరవేరాలని భగవంతున్ని వేడుకున్నట్లు కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ తెలిపారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని మంగళవారం బోయిన్‌పల్లి ప్లే గ్రౌండ్ వద్ద కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్య అతిధిగా హాజరై న్యూయర్ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాయిబాబా యాదవ్, హరిక్రిష్ణ, షకీబ్, హుస్సెన్,షిరాజ్, అరుణ్ యాదవ్, మధు, మౌలా పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధి చెక్కు అందజేత


లబ్ధిదారుడికి ముఖ్యమంత్రి సహాయనిధి పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

**అడ్డగుట్ట, డిసెంబర్ 31 ప్రభాతవార్త:** వాచ్‌మెన్‌కు చికిత్స కోసం అండగా నిలిచారు మాజీమంత్రి, సనత్ నగర్ లీలితి తలసాని శ్రీనివాస్ యాదవ్. అమీర్‌పేటకు చెందిన రాజేష్ అపార్ట్మెంట్‌కు వాచ్‌మెన్‌గా ఉంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవల రాజేష్ కడుపు నొప్పితో బాధపడుతూ చికిత్స కోసం నిమ్స్ హస్పిటల్ వైద్యులను సంప్రదించగా, వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఆపరేషన్ చేయాలని సూచించారు. నిరుపేద అయిన రాజేష్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి తన ఆర్థిక పరిస్థితి వివరించి చికిత్స కోసం సహాయం అందించాలని కోరారు. స్పందించిన తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఆపరేషన్ కోసం ఒక లక్ష 10 వేల రూపాయల ఆర్థిక సహాయం మంజూరైంది. మంగళవారం వెస్ట్ మారేడ్ పల్లి లోని తన కార్యాలయంలో ఆర్థిక సహాయం మంజూరు పత్రం (ఎల్‌ఓసీ) ని రాజేష్‌కు అందజేశారు. ఆర్థిక సహాయం మంజూరు చేయించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు రాజేష్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమీర్ పేటకు చెందిన బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి నామనసంతోష్ కుమార్, నాయకులు కె. నర్సింహ, సుమిత్ సింగ్, బలరాం తదితరులు పాల్గొన్నారు.

## రాంగోపాల్‌పేటలో సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోండి

-జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం అందించిన కార్పోరేటర్ చీరె


జోనల్‌కమీషనర్‌ను కల్సి వినతి పత్రం అందిస్తున్న కార్పోరేటర్ చీరె సుచిత్ర శ్రీకాంత్

**బేగంపేట డిశంబరు 31,ప్రభాతవార్త**

రాంగోపాల్‌పేట డివిజన్ పరిధిలో పరిష్కారానికి నోచుకోని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని,ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత శాఖాధికారులకు తగిన ఆదేశాలు జారీ చేసి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలంటూ రాంగోపాల్‌పేట కార్పోరేటర్ చీరె సుచిత్ర శ్రీకాంత్ మంగళవారం సికింద్రాబాద్ జోనల్ కమీషనర్ రవికిరణ్‌ను తెలంగాణా రాష్ట్ర ఓబీసీ ఉపాధ్యక్షుడు చీరె సత్యనారాయణ (శ్రీకాంత్),బీజేపీ డివిజన్ ఉపాధ్యక్షుడు మనోజ్ ఉపాధ్యాయతో కల్సి వినతి పత్రం అందించారు.ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై క్లుప్తంగా జోనల్ కమీషనర్ కు వివరించారు.సమస్యలు మళ్లీ తలెత్తకుండా తగిన జాగ్రత్తలు చేపట్టాలన్నారు.గుంతలు పడిన రోడ్లతో పాటు రోడ్లను ఎవరిష్టం వచ్చినట్లు వారు తవ్వుతున్నారని అలాంటి వారిపై చర్యలు చేపట్టాలన్నారు.ప్రజాధనం వృధా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.కొన్ని ప్రాంతాల్లో భారీగా పెరిగిన చెట్ల కొమ్మలు వీధి దీపాలకు అడ్డుగా వస్తున్నాయన్నారు.రకరకాలైన క్రిమి కీటకాలు ఇళ్లలోకి చేరుతున్నాయన్నారు, పారిశుధ్య కార్మికుల కొరత వల్ల రోడ్లకు ఇరువైపులా చెత్తకుప్పలు పేరుకుపోయి తీవ్ర దుక్వాసర వెదజల్లుతుందన్నారు. దోమల స్వైర విహారం కూడా అధికంగా ఉంటుందన్నారు.వీటివల్ల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. రిటైర్మెంట్ అయిన పారిశుధ్య కార్మికుల స్థానాల్లో కొత్త వారిని నియామకం చేసి పారిశుధ్య సమస్యను పరిష్కరించాలని కోరారు.కొన్ని ప్రాంతాల్లో వీధి దీపాలు రావడం లేదని,వాటిని వెంటనే వేయించాలన్నారు,అలాంటి ప్రాంతాల్లో ఆకతాయిలు,తాగుబోతుల ఆగడాలు అధికంగా ఉంటున్నాయంటూ ప్రజలు తమ దృష్టికి తీసుకు వస్తున్నారన్నారు.ఆయా సమస్యలపై వెంటనే సిబ్బందిని అప్రమత్తం చేసి పరిష్కారానికి కృషి చేయాలంటూ జోనల్ కమీషనర్‌ను కార్పోరేటర్ కోరారు.అనంతరం డీసీ సమ్మయ్యకు కూడా కార్పోరేటర్ వినతిపత్రం అందజేసారు.

## కంటోన్మెంట్ బోర్డులో నామినేటెడ్ మెంబర్ అవకాశం కల్పించాలి : బానుక నర్మధ


కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ కోసం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బానుక నర్మధ మల్లికార్జును

**కంటోన్మెంట్,డిసెంబరు31 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్‌గా తమకు అవకాశం కల్పించాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షురాలు బానుక నర్మధ, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బానుక మల్లికార్జున్‌లు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్, రాజ్య సభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్, భగవత్ కరాడ్‌లకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం భావన కాలనీలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి వస్తుందని, అదే విధంగా కంటోన్మెంట్‌లో బిజెపి జెండా ఎగరవేస్తామన్నారు. తమకు పదవులు వచ్చినా రాకపోయిన బిజెపిలోనే కొనసాగుతామన్నారు. బోర్డు ఎన్నికలు వస్తే కంటోన్మెంట్‌లోని 8 వార్డులలో బిజెపిని గెలిపించుకుంటామన్నారు. బూత్ స్థాయి నుంచి నియోజకవర్గంలో బిజెపి పటిష్టం చేశామన్నారు. నామినేటెడ్ సభ్యునిగా కొనసాగుతున్న రామక్రిష్ణకు అధిష్టానం నాలుగు సార్లు అవకాశం కల్పించిందని, వచ్చే నెల ఫిబ్రవరి 10 నాటికి బోర్డు మెంబర్ పదవి కాలం ముగుస్తున్నందు వల్ల తమకు అవకాశం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు బాణాల శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### సర్వ మానవాళికి కోసమే యేసు రాక :ఎమ్మెల్యే శ్రీగణేష్


వైఎంసీఏలో క్రిస్మస్ వేడుకల్లో ప్రసంగిస్తున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

**కంటోన్మెంట్,డిసెంబరు31 ప్రభాతవార్త:** యేసు క్రీస్తూ సర్వ మానవాళి కోసం లోకానికి వచ్చారని, అందుకే క్రిస్మస్ వేడుకలు ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటారని కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. రైల్ నిలయం అంబేద్కర్ నగర్ షారోన్ చర్చి మందిరం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి సికింద్రాబాద్ వైఎంసీఏ ప్రాంగణంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో షారోన్ చర్చి అధ్యక్షులు పి.యేసుదాస్, ఫాస్టర్లు జాన్ పాల్, శ్యామ్‌సన్, అంబాల, మనోహర్, జాన్ తదితరులు పాల్గొన్నారు

### ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో మార్పులు తేవాలి : తేలుకుంట


బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్, వేమ్ నరేందర్ రెడ్డిలతో సమావేశమైన రాజీవ్ రహదారి ప్రాపర్టీ జేఏసి నేత తేలుకుంట సతీష్

**కంటోన్మెంట్,డిసెంబరు 31 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ జింఖానా మైదానం జెబిఎస్ నుంచి శామీర్‌పేట్ వరకు ఏర్పాటు చేయనున్న ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణంలో రోడ్డు వెడల్పులో నష్టపోతున్న వారికి న్యాయం చేయాలని, అందుకు రోడ్డు వెడల్పు ప్రణాళికలో మార్పులు తీసుకు రావాలని రాజీవ్ రహదారి ప్రాపర్టీస్ జేఏసి చైర్మన్ తేలుకుంట సతీష్ గుప్త మంగళవారం సిఎం సలహా దారులు వేమ్ నరేందర్ రెడ్డి,బెల్లంపల్లి ఎమ్మెల్యే జి.వినోద్‌లతో సమావేశమైయ్యారు. ఎలివేటెడ్ కారిడార్లలో రోడ్డు వెడల్పులో మార్పులు తీసుకు రావాలని వారి దృష్టికి తెచ్చారు.

## ఆంగ్ల క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే


క్యాలెండ్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

**అల్వాల్, డిసెంబరు 31 ప్రభాతవార్త:** సురష్ సేవా సమితి ఆధ్వర్యంలో రూపుదిద్దుకున్న నూతన సంవత్సర ఆంగ్ల క్యాలెండర్‌ను ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. మచ్చబొల్లారం మార్కెట్ వద్ద జరిగిన కార్యక్రమంలో అతిధిగా పాల్గొన్న ఎమ్మెల్యే సురేష్ సేవా సమితి సేవా కార్యక్రమాలను కొనియాడారు. నూతన సంవత్సరంలో ప్రజలు సుఖ సంతోషాలుతో ఉంటారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు డోలి రమేష్, శోభన్, పరమేష్, బాలేష్, రాజిరెడ్డి, ధన్‌రాజ్ పాల్గొన్నారు.

### పదవీ విరమణ పొందిన వారిని సన్మానించిన ఉద్యోగులు


పదవీ విరమణ పొందిన వారిని సన్మానిస్తున్న దృశ్యం

**అడ్డగుట్ట, డిసెంబర్ 31 ప్రభాతవార్త:** టీజీ ఆర్టీసీ కంటోన్మెంట్ బస్‌డిపోలో విధులు నిర్వహిస్తున్న ఆఫీస్ సూపరిండెంట్ వెంకటరమణ, గ్యారేజీ విభాగంలో పనిచేస్తున్న రవిలు మంగళవారం పదవి విరమణ పొందారు ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో భాగంగా వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ సుధాకర్ రావు అసిస్టెంట్ మేనేజర్ శ్రీపతికృష్ణ ఎంఎఫ్ బాలరాజులు పాల్గొని పార్టీ సంస్థకు వారు చేసిన సేవలను కొనియాడారు

## నిరాశ్రయులకు రగ్గులు పంపిణీ

**బేగంపేట డిశంబరు 31,ప్రభాతవార్త**

రోడ్డుపైన ఆశ్రయం పొందుతూ చలికి గజ గజ వణుకిపోతున్న నిరాశ్రయులకు తాము అండగా ఉన్నామంటూ ఆస్టర్ ప్రైమ్ ఆస్పత్రి నర్సులు సహృదయంతో ముందుకు వచ్చారు.వారికి చలి నుంచి రక్షణగా రగ్గులు పంపిణీ చేసారు.ఎస్సార్ నగర్ తో పాటు పలు ప్రాంతాల్లో వీధుల్లో ఉంటున్న నిరుపేదలు,ఫుట్‌ఫాత్‌లపై నిద్రించే వారికి వారు అండగా నిలిచారు.సుమారు 50మంది నిరుపేదలకు రగ్గులు పంపిణీ చేసారు.ఆస్పత్రికి చెందిన 120మంది నర్సులు తమ సంపాదనలో కొంత మొత్తాన్ని సేకరించి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.2025సంవత్సరానికి ముందుగా తాము ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం తమకెంతో సంతోషంగా ఉందన్నారు.ప్రతి ఏడాది తామంతా కొంత మొత్తాన్ని జమచేసుకుని వేడుకలను నిర్వహించుకుంటామని,ఈ ఏడాది పేదలకు తమకు తోచిన విధంగా సాయం అందించాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు.రానున్న ఏడాదిలో ఈ కార్యక్రమాలను మరింత ముమ్మరం చేస్తామని వారు తెలియజేసారు.ఈ మధ్య కాలంలో రోడ్ల పక్కన చలితో విల విల లాడుతున్న వారిని గుర్తించి తాము ఈ కార్యక్రమానికి నాంది పలికామని వారు తెలియజేసారు.ప్రతి ఒక్కరూ ఇలాంటి కార్యక్రమాలను చేయాలని వారు పిలుపు నిచ్చారు.

## జగద్గిరిగుట్టలో ప్రభుత్వ స్థలాన్ని కాపాడండి

: గాజులరామారం ఉపకమిషనర్‌కు బిజెపి నేతల వినతి

**కుత్బుల్లాపూర్, డిసెంబరు 31 ప్రభాతవార్త**

గాజులరామారం సర్కిల్ జగద్గిరిగుట్ట రాజీవ్‌గృహకల్ప 32వ బ్లాక్‌లో కబ్జాకు గురవుతున్న ప్రభుత్వస్థలాన్ని తక్షణం రక్షించి ప్రజా ప్రయోజనాలకు వినియోగించాలని భారతీయ జనతా పార్టీ నాయకులు ఆకుల సతీష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం గాజులరామారం ఉపకమిషనర్ మల్లారెడ్డికి బాజాపా నేతలు ఆకుల సతీష్, నల్ల జైశంకర్‌గౌడ్‌లతో పాటు పలువురు నేతలు ఉపకమిషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వ స్థలానికి దొంగడాక్యుమెంట్లను సృష్టించి స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తూ ప్రభుత్వ స్థలాన్ని కబ్జాచేసేందుకు యత్నిస్తున్నారని వారు ఆరోపించారు. పట్టా కెఎంనగర్‌వద్ద అనుమతి తీసుకుని అధికారులకు బురిడీకొట్టించి ఆర్‌జికె 32బ్లాక్‌వద్ద నిర్మాణం చేపడుతున్నట్లు వారు పేర్కొన్నారు. జగద్గిరిగుట్ట ఆర్‌జికె 32బ్లాక్ పక్కన దొంగపత్రాలతో అనధికార అనుమతులతో నిర్మాణాలను చేపట్టడాన్ని అధికారులు తక్షణం ఆపాలని విజ్ఞప్తిచేశారు. తక్షణంప్లానింగ్ అనుమతులను రద్దుచేసి స్థానికులకు మారయ్యనుండి పూర్తిరక్షణ కల్పించాలని బిజెపి నేతలు ఆకుల సతీష్, నల్ల జైశంకర్‌గౌడ్‌లు డిమాండ్‌చేశారు. ప్రభుత్వ భూమి సర్వేనెంబరు 348లో దొంగపట్టాలను సృష్టించి వాటిద్వారా దరఖాస్తు చేసుకున్న ఆక్రమణ దారులపై చట్టపరమైన చర్యలను వెంటనే చేపట్టి ప్రజాప్రయోజనాలకు సంబందిత స్థలాన్ని వినియోగించేందుకు తక్షణం చర్యలు చేపట్టలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిజెపి నేతలు ఎంబరి ఆంజనేయులు,చందు, ఈశ్వర్‌రెడ్డి, పాండు పాల్గొన్నారు.

## పాతబస్తీలో నూతన సంవత్సరం వేడుకలు


నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు రాజేష్ కుమార్,ముజీబుల్లా షరీఫ్,బోయ నగేష్,రవిరాజ్

**చార్మినార్,డిసెంబరు 31 ప్రభాతవార్త :**

పాతబస్తీలో మంగళవారం సెక్యూర్ ఫ్లస్ ఇన్సూరెన్స్ సర్వీసెస్ సంస్థలో కొత్త సంవత్సరం వేడుకలు జరిగాయి.ఈ వేడుకల్లో బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పులిపాటి రాజేష్ కుమార్,చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి ముజీబుల్లా షరీఫ్,యాకుత్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కె.రవిరాజ్, చాంద్రాయణగుట్ట నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ బోయ నగేష్, సంస్థ భాగ స్వాములు కంచారపు వెంకట సురేష్,సందేశ ప్రశాంత్‌లు కలిసి కొత్త సంవత్సరానికి స్వాగతిస్తూ కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో న్యాయవాది గిరిధర్,రవీందర్, భాగ్య, అనురాధ, మమతా, వినయ్,సంజన రెడ్డి,శిరీష,శైలజ,లక్ష్మీ, అశ్విని,లావణ్య, సౌమ్య,అపర్ణతో పాటు పలువురు పాల్గొన్నారు.

## గంగపుత్రుల సంక్షేమానికి కృషి : పద్మారావు గౌడ్


ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌ను సన్మానిస్తున్న డాక్టర్ దేశబోయిన రఘు తదితరులు

**సికింద్రాబాద్, డిసెంబర్ 31 ప్రభాతవార్త:** గంగపుత్రుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్నామని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. సీతాఫల్‌మండీలోని ఎం.ఎల్.ఏ. క్యాంపు కార్యాలయంలో వారాసిగూడ గంగపుత్ర సంఘం నూతన సంవత్సర క్యాలెండరు ఆవిష్కరించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ బీ.సీ. వర్గాల ప్రయోజనాల పరిరక్షణకు పాటు పడుతున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర గంగపుత్ర సంఘం అధ్యక్షుడు, వారాసిగూడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ దేశాబోయిన రఘు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గంగపుత్రులకు తగిన గుర్తింపు లభించడం లేదని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడి ఉండడంతో పాటు రాజకీయంగా మరింత మెనుకబడి ఉన్నారని, రాజకీయ పార్టీలు గంగపుత్రుల వద్ద ఓట్లు దండుకోవడానికి పావులుగా వాడుకుంటున్నారు తప్ప తగిన స్థానం కల్పించడం లేదని తెలిపారు. రానున్న రోజులలో గంగపుత్రుల వివిధ రంగాలలో అభివృద్ది చెందడానికి పోరాటం చేస్తామన్నారు. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదగడానికి తగిన ప్రోత్సాహాన్ని అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గంగపుత్ర సంఘం గౌరవాధ్యక్షుడు కైరంకొండ సత్యనారాయణ, సంజీవ్ కుమార్, సంఘం ప్రతినిధులు పూసా రాజ్ కుమార్, యాదగిరి, మద్దెర్ల కిరణ్ కుమార్, శ్యాం ప్రసాద్, విశాల్, నరేశ్, కప్పర బోయిన రఘు, వల్లాల సుధాకర్, సదానంద్, కంటే సంపత్, వివేకానంద్, సునీల్ కుమార్, నేతలు కంది నారాయణ, కైరంకొండ యాదగిరి పాల్గొన్నారు.

## విద్యుత్ సంస్థలు ప్రైవేటీకరిస్తే దేశవ్యాప్త ఉద్యమం



నిరసన తెలుపుతున్న ఇంజనీర్లు

**హైదరాబాద్, డిసెంబరు 31,ప్రభాతవార్త:**

విద్యుత్ సంస్థలు ప్రైవేటీకరణ చేస్తే సహించేది లేదని దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటి హెచ్చరించింది. ఈమేరకు జేఏసీ కన్వీనర్ రత్నాకర్ రావు కోకన్వీనర్ బిసిరెడ్డి, ఈశ్వర్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో నేషనల్ కో ఆర్డినేషన్ కమిటీ అఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ అండ్ ఇంజనీర్స్ (ఎన్‌సిసివోఈఈఈ) పిలుపుమేరకు మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ కార్యాలయాల ముందు ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా కన్వీనర్ రత్నాకర్‌రావు మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్, చండీగఢ్ రాష్ట్రాల విద్యుత్ సంస్థలను ప్రైవేటు పరం చేయాలని కేంద్రం భావిస్తుందని దాన్ని తప్పకుండా అడ్డుకుంటామన్నారు. ఆయా రాష్ట్రాల ఉద్యోగులకు మద్దతుగా తాము ఈ ఆందోళన చేపట్టినట్లు తెలిపారు. ఇటీవల నాగపూర్‌లో జరిగిన అల్ ఇండియా ఎంప్లాయిస్ ఫెడరేషన్ మీటింగ్లో దేశవ్యాప్తంగా ఏ రాష్ట్రంలో నైనా విద్యుత్ రంగాన్ని ప్రైవేటకరిస్తే ఆ రాష్ట్రాలకు మద్దతుగా అన్నిరాష్ట్రాలు నిలవాలని ఆందోళన కార్యక్రమం చేయాలని నిర్ణయించామని తెలిపారు. కోకన్వీనర్ బిసిరెడ్డి మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్, చండీగఢ్ విద్యుత్ సంస్థ ప్రైవేటీకరణ నిర్ణయం వల్ల దేశంలో ఉన్న 27 లక్షల మంది ఉద్యోగులు నిరసన కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. యుపిలో ఉద్యోగులపై యస్మాప్రకటించినా గాంధీయ మార్గంలో నిరసనలు తెలుపుతున్నారన్నారు. జేఏసీ నాయకులు ఈశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరణ కానివ్వకుండా చూస్తామని దానికోసం ఎంతవరకైనా వెళ్లడానికి సిద్దమన్నారు. ఈకార్యక్రమంలో జేఏసీ నాయకులు సదానందం, మనోరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సురేష కుమార్, కిరణ్, బాగయ్య, సతీష్, వెంకటేష్, భాస్కర్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యల పరిష్కారానికి ఆదేశాలు జారీ

-జలమండలి కంగర్ యూనియన్ అధ్యక్షులు మొగుళ్ళ రాజి రెడ్డి వెల్లడి


జలమండలి ఎండికి వినతిపత్రం ఇస్తున్న రాజిరెడ్డి బృందం

**హైదరాబాద్, డిసెంబరు 31,ప్రభాతవార్త:**

దీర్ఘకాలికంగా పెండింగ్ లోఉన్న జలమండలి కార్మికుల సమస్యల పరిష్కారానికి జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి తగు ఆదేశాలు జారీ చేసారని ఐ.ఎన్.టి.యు.సి రాష్ట్ర ఉపాధ్యక్షులు, జలమండలి కంగర్ యూనియన్ అధ్యక్షులు మొగుళ్ళ రాజి రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్, ఖైరతాబాద్ జలమండలి కార్యాలయంలో మంగళవారం జలమండలి కాంగార్ యూనియన్ అధ్యక్షులు మొగుళ్ళ రాజి రెడ్డి నేతృత్వంలో ప్రతినిధి బృందం జలమండలి కార్మికుల సమస్యలపై జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్ ను కలసి వినతి పత్రం అందజేసి చేర్చించారు. వివిధ సర్కిల్ లలో పెండింగ్లో ఉన్న ప్రమోషన్స్ జి.పి.ఈ నుండి ఎస్.పి.ఇ, టెక్నికల్ గ్రేడ్. 2 మరియు అన్ని బ్రాంచిలు, బోర్డు లో ఖాళీగా ఉన్న ఆఫీసర్, సీనియర్ ఆఫీసర్, జె.టీ.ఓ, క్యూ.ఏ.టీ అప్గ్రేడ్ ప్రమోషన్, ఎన్. వేణుగోపాల్ జె. టీ. ఓ పెండింగ్ ప్రమోషన్ లపై చేర్చించమని, అలాగే జలమండలి కార్మికులకు ఉచిత హెల్త్ కార్డుల వెంటనే తగు చెర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశామని, మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి వెంటనే ఆదేశాలు జారీ చేసారని మొగుళ్ళ రాజి రెడ్డి తెలిపారు. ఈకార్యక్రమం లోయూనియన్ అసోసియేట్ ప్రెసిడెంట్ బి. భూమయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ కె. రామ రాజు, ప్రధాన కార్యదర్శి సి. హెచ్. సురేష్ బాబు, కార్యవర్గ సభ్యులు రఘునాథ్, నాగరాజు వర్మ, వెంకటేష్ ఈ చేర్చల్లో పాల్గొన్నారు.

### పేదలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి

**కంటోన్మెంట్,డిసెంబరు31 ప్రభాతవార్త:**

పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని సీనియర్ కాంగ్రెస్ నేత పెద్దాల నర్సింహ్మా తెలిపారు. జనహిత సేవా ట్రస్ట్ శివశక్తి పౌండేషన్, కిమ్స్ పౌండేషన్ అండ్ రిసెర్చ్ సెంటర్ల సంయుక్త అధ్వర్యంలో మంగళవారం కంటోన్మెంట్ 5వ వార్డు గాంధీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. వైద్య పరీక్షలు చేయించుకున్న రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు వెంకట్ నారాయణ, మెడికల్ క్యాంప్ కో-ఆర్డినేటర్లు బి.నరిసింగ్ రావ్, విక్రమ్, శ్రీనివాస్, బస్తీ పెద్దలు మల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

## టిఎస్‌యూటిఎఫ్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



క్యాలెండర్, డైరీలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ ఏ.నర్సిరెడ్డి

**ముషీరాబాద్, డిసెంబర్ 31, ప్రభాతవార్త:** టీఎస్‌యూటీఎఫ్ 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌లను, డైరీలను ఎమ్మెల్సీ ఏ.నర్సిరెడ్డి చేతుల మీదగా ఆవిష్కరించారు. మంగళవారం దోమలగూడలోని టీఎస్‌యూటీఎఫ్ కార్యాలయంలో జరిగిన ఈ ఆవిష్కరణ సభలో ఆయన మాట్లాడుతూ ఇటీవల నల్గొండలో జరిగిన టీఎస్‌యూటీఎఫ్ 6వ మహాసభలో విద్యారంగం మరియు ఉపాధ్యాయ సమస్యలపై చేసిన తీర్మానాలకు అనుగుణంగా రాష్ట్రప్రభుత్వం స్పందించాలని కోరారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, ప్రధాన కార్యదర్శి ఏ.వెంకట్, ఉపాధ్యక్షులు కే.జంగయ్య, కోశాధికారి టి.లక్ష్మారెడ్డి, వాయిస్ ఆఫ్ తెలంగాణ టీచర్ ప్రధాన సంపాదకులు పి.మాణిక్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు ఏ.సింహాచలం, ఎం.వెంకటప్ప, మహిళా విభాగం కన్వీనర్ ఆర్.శారద, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కే.గోపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు కృషి చేయాలి :మండవ శ్రీనివాస్‌గౌడ్

**జీడిమెట్ల, డిసెంబరు 31 ప్రభాతవార్త**

విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలిసితీసి ఉత్తమపౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులపాత్రకు తల్లిదండ్రుల ప్రోత్సాహం తోడవ్వాలని మండవ శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. సుభాష్‌నగర్‌లోని వివేకానంద విద్యామందిర్ 2025 కాలమాలికను ఆయన విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమక్షంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఎం.సునిత, వైస్ ప్రిన్సిపల్ లతల ఆధ్వర్యంలో నిర్వహించారు ఈసందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ పాఠశాలలో విద్యనభ్యసించి ప్రస్తుతం ఇంటర్, డిగ్రీ, పిజి విద్యనభ్యసిస్తున్న విద్యార్థులబాటలో ఉత్తమ ఫలితాల సాధనకు కృషిచేయాలన్నారు. నేటిబాలలే రేపటి పౌరులన్న నినాదంలో ఉత్తమ విద్యార్థులు గుర్తించి పొంది సమాజానికి గుర్తింపుతేవాలని విద్యార్థులకు సూచించారు.


**IN THE COURT OF THE HON'BLE XI ADDL. CHIEF JUDGE, CITY CIVIL COURT, AT : HYDERABAD**
**O.S.No. 534 of 2024**

**Between:**
AV Shashikala, D/o Late Arcot Vardaraj, W/o. Sri KG Narender Rao, aged about 67 years, Occ: Retd. Professor, R/o. H.No.4-125, Agnihotra House, Maruthinagar, Malkajgiri, RR District. **...Plaintiff**

**AND**

1.The Tahsildar, Himayath Nagar Mandal, Near RTC Kala Bhavan, Baghlingampally, Hyderabad-44
2. All Concerned **...Defendants**

To
All Concerned

**PUBLIC NOTICE**

The above named plaintiff has filed OS No. 534 of 2024 on the file of XI Addl. Chief Judge, City Civil Courts at Hyderabad to declare the plaintiff as sole Legal Heir & Successor to the estate of late Arcot Satish Vardaraj S/o. Late Arcot Vardaraj, who died on 01.06.2024. The Hon'ble court has directed to take out public notice through publication to all concerned, inviting objections/claims if any, on the subject matter and the matter is posted on 09.01.2025. Therefore please take notice accordingly and if any person is aggrieved or has any objection/claim on the subject matter, may appear before the Hon'ble court either in person or through a counsel at 10.30am. on 09.01.2025, failing which the matter will be decided in accordance with law. **SCHEDULE OF PROPERTY:** All that the part and parcel of house bearing No. 1-8-115/3, admeasuring 204.6 Sq.yds situated at Street No.10, Chikkadpally, Hyderabad-20, Telangana and bounded by: North : 30'Ft. Wide Road. South : Neighbour's House No.1-8-116/2. East : House No. 1-8-116. West : House No.1-8-115/2.

**(BY ORDER OF THE HON'BLE COURT)**
**Sd/-. Rathnam N.**
**K.Narsi Reddy,** Advocates
Off: 1-8-422/1, Chikkadpally, Hyderabad-500020.
**Mob: 9866091103.**

**IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE, RANGA REDDY DISTRICT AT HAYATH NAGAR**
**OS No: 970 OF 2024**

Between:
**Smt. Nagalakshmi Bodducharla & others ...Plaintiffs**

AND

**The Tahsildar, Abdullapurmet Mandal & Another ...Defendants**

To,
**All Concerned ...Defendant No:2**

That the Plaintiffs has filed the above suit for Declaration praying this Hon'ble Court to declare them as the legal heirs of Late Bodducharla Narasimha Rao, who died on 22/11/2024. The plaintiffs further submits that they are the absolute owners and peaceful possessors of the suit schedule property being the legal heir of Late Bodducharla Narasimha Rao, vide suit schedule property as follows:

**SUIT SCHEDULE PROPERTY**

All that part and parcel of plot bearing No: 40 Northern Part, admeasuring 100 sq yds or 83.61 sq meters in Sy No: 243 & 244 situated at Injapur Village of Abdullapurmet Revenue Mandal, Ranga Reddy District under SRO- Vanasthalipuram and bounded by: NORTH: Plot No: 39, SOUTH: Plot No: 40, Southern Part, EAST: 25' wide Road, WEST: Plot No: 46.
The above suit is posted to dated: **28/01/2025.** If anybody is having any objection/s, interest or claim may appear before the Hon'ble Court on **28/01/2025 at 10.30 AM** by person or through an Advocate, failing which the matter will be decided on merits in your absence.

(BY ORDER OF THE COURT)
**Sd/- NANDUTI SANTHOSH KUMAR**
**Advocate**
**Office:** Plot No:20, Durga Nagar Colony, Phase-II, Injapur Village, Turkayamjal Municipality,R.R.Dist-501510, **Cell No: 9848933543**

## వెంకటేశ్వర కాలనీ ఆలయంలో తీరుప్పావై ప్రవచనములు



ప్రవచనాలు తెలుపుతున్న నరసింహా చార్యులు

**హుడాకాంప్లెక్, డిసెంబరు 31, ప్రభాతవార్త:** శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రమన్నారాయణ చిన్న జీయర్ స్వామీ దివ్య మంగళ శాసనము లతో , శ్రీ తిరుమల తిరుపతి దేవస్థనం, ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్ట్ వారి సౌజన్యం తో హంపి విరూపాక్ష విద్యారన్య సంస్థానం ఆద్వర్యంలో సరూర్నగర్ లోని వెంకటేశ్వర దేవాల యంలో ధనుర్మాస తిరుప్పావై ప్రవచనములు వెంకట నరసింహా చార్యులు చే 16.12.24 నుండి నిర్వహించడం జరుగుతుంది. ఈ ప్రవచనాలు 16 డిసెంబరు నుండి 13 జనవరి 2025 వరకు కొనసాగుతాయి. ప్రతి రోజు భక్తులు ఈ ప్రవచనాలకు హాజరు అవుతున్నారని దేవాలయ కమిటీ తెలిపింది.

## విద్యార్థులను మానసికంగా, శారీరకంగా దృఢంగా తీర్చిదిద్దాలి : ఇస్రో ఇంజనీర్ గోడి వెంకటరమ



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఇస్రో ఇంజనీర్ వెంకటరమణ, సీఈవో చైతన్య, జెడ్ఇఓ అంకమ్మరావు, ప్రిన్సిపాల్ పల్లవి తదితరులు

**మలక్ పేట, డిసెంబరు 31, ప్రభాతవార్త:** విద్యార్థులలో మాన సిక పరిపక్వతతో పాటు శారీరక దృఢత్వాన్ని పెంపొందించే విధంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కృషి చేయాలని ఇస్రో శాటిలైట్ స్టేషన్ ఇంజనీర్ గోడి వెంకటరమణ పేర్కొన్నారు. భాష్యం పాఠశాల 12వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దడం లో ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిదని తెలిపారు. విద్యార్థులు మొబైల్ వాడడం వల్ల వారి జ్ఞాపకశక్తి నశిస్తుందని, విద్యార్థులు మొబైల్ వాడకాన్ని తల్లిదండ్రులు అరికట్టాలని విజ్ఞప్తి చేస్తారు. సీఈఓ చైతన్య, జడ్ఇఓ అంకమ్మరావు, హై స్కూల్ ప్రిన్సిపాల్ పల్లవి, లిటిల్ చాంప్స్ ప్రిన్సిపాల్ భానుమతిలు మాట్లాడుతూ విద్యార్థులకు అత్యుత్తమ అధ్యాపక బృందంతో ఆధునాతన పద్ధతి లో పాఠ్యాంశాలను బోధిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని పేర్కొన్నారు. ఉత్త మ ఫలితాలు సాధించిన విద్యార్థులకు వారు బహుమతులను అం దజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పలు వురు విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వ్యాపారస్తుల సంక్షేమానికి కృషి: డైరెక్టర్ మాదారం కృష్ణ



డైరెక్టర్ మాదారం కృష్ణను సన్మానిస్తున్న వ్యాపారస్తులు

**మలక్ పేట, డిసెంబర్ 31, ప్రభాతవార్త:** వ్యాపారస్తులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమాన్ని కృషి చేస్తామని హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాదారం కృష్ణ పేర్కొన్నారు. మలక్ పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్లలో జరిగిన కార్యక్రమంలో హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గా పదవి బాధ్యతలు చేపట్టి న మాదారం కృష్ణను పలువురు వ్యాపారస్తులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్చాలను అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారస్తుల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారాన్ని చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అదేవిధంగా రైతులకు మెరుగైన గిట్టుబాటు ధరను అందించడానికి కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వం తమపై ఉంచిన బాధ్యతలను సక్రమంగా నెరవేరుస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మిర్చి ఎక్స్ పోర్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు చిగుమల్ల శంకర్, నరసింహ, రాజేంద్ర బాబు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు సుఖశాంతులతో ఉండాలి : సి.ఐ. శ్రీనివాస్



ఇన్స్పెక్టర్ శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న క్రిస్టియన్ సోదరులు

**వనస్థలిపురం. డిసెంబరు.31.ప్రభాతవార్త :** వనస్థలిపురంలో ని లిటిల్ లాంబ్ చర్చి లో క్రిస్టమస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రభుత్వం ఇచ్చిన విందులో వనస్థలిపురం డివిజన్ లోని 11 చర్చి లకు సంబంధించిన సుమారు 500 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ పాస్టర్ రెవరెండ్.డాక్టర్. కె.సుదర్శన్ రావు బైబిల్ సందేశాన్ని ప్రజలకు వినిపించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా వనస్థలిపురం ఇన్స్పెక్టర్ సి.ఎచ్.శ్రీనివాస్ విచ్చేసి ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ,శాంతియుత మా ర్గంలో నడవాలన్నారు.ఈ కార్యక్రమంలో అసోసియేట్ పాస్టర్ పి.ప్రమోద్ కుమార్,చర్చి అధ్యక్షుడు టి.ఎస్. బాబూ రావు, సురేష్ కుమార్, ఎన్. జాన్. జార్జి ముల్లర్, ఏలీయా, ఎం. బి.రాజు,జెస్సి, కిషోర్ బాబు,యోసోబు, రాజు పాల్గొన్నారు

## అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి : కార్పొరేటర్



కమ్యూనిటి హాల్ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి

**సైదాబాద్, డిసెంబరు 31 ప్రభాతవార్త:** అభివృద్ధి పనుల్లో నాణ్యతను పాటించాలని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అన్నారు. ఎల్‌సిహెచ్ చిన్న కాలనీ, పద్మావతి కళ్యాణ మండపం, రెవిన్యూబోర్డు కాలనీలలో చేపడుతున్న కమ్యూనిటీ హాల్స్ నిర్మాణ పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నా రు. ఈ కార్యక్రమంలో ఎఇ వెంకన్న, వర్క్ ఇన్స్పెక్టర్ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులను సత్కరించిన రాచకొండ కమిషనర్



పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులను సత్కరించిన రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు

**నేరేడ్‌మెట్, డిసెంబర్ 31 ప్రభాతవార్త :** రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లో పనిచేస్తూ మంగళవారం పదవీ విరమణ పొందిన పోలీస్ కంట్రోల్ రూమ్ ఎస్ఐ ఆర్. లచ్చిరాం, స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన ఉప్పల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ జి. కృష్ణలను సీపీ శ్రీ సుధీర్ బాబు, ఐపీఎస్ ఎల్ బి నగర్ లోని రాచకొండ క్యాంపు కార్యాలయంలో సన్మానం చేయడం జరిగింది. ఈ సంద ర్భంగా సీపీ మాట్లాడుతూ ఇన్ని రోజులు పోలీసుశాఖలో సమర్థవంతంగా క్రమశిక్షణతో పనిచేసి సేవలు అందించినందుకు అభినందించారు. పదవీ విరమణ అనంత రం విశ్రాంత జీవితాన్ని ప్రశాంతంగా గడపాలని, ఆరోగ్యం పట్ల అధిక శ్రద్ధ చూపాలని, పెన్షన్ మరియు ఇతర ఆర్థిక అంశాల పట్ల క్రమశిక్షణ పాటించాలని సూచించారు. వారికి రావాల్సిన అన్ని రకాల ప్రయోజనాలు త్వరగా వచ్చే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశిం చారు. పదవీ విరమణ పొందే అధికారులు మరియు సిబ్బం ది సంక్షేమం కోసం కమిషనర్ సుధీర్ బాబు ఐపీఎస్ గారి ప్రత్యేక చొరవతో ఏర్పాటు చేసిన పెన్షన్ డెస్క్ ద్వారా ఈరోజు పదవీ విరమణ పొందిన లచ్చిరాంకు తక్షణమే పెన్షన్ సౌకర్యం మంజూరు చేయడం పట్ల లచ్చిరాం సిపికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీసీపీ అడ్మి న్ ఇందిర, ఎల్‌బినగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్ ఐపీఎస్, డీసీపీ సైబర్ క్రైమ్ నాగలక్ష్మి, ఎస్టేట్ ఆఫీసర్ ఆర్.ఐ నా యుడు, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు సీహెచ్ భద్రారెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా భారతీయ విద్యా భవన్ కళాశాలలో యువ మహోత్సవ వేడుకలు

**-70 మంది విద్యార్థులతో ప్రత్యేక నృత్య రూపం....**



సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

**నేరేడ్‌మెట్, డిసెంబర్ 31 ప్రభాతవార్త :** విద్యార్థులు భారతీ య సంస్కృతి సంప్రదాయాలను తెలుసుకొని భావితరాలకు అందేలా కృషి చేయాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి ఎస్ వి ఆర్ కె చౌదరి పేర్కొన్నారు. నేరేడ్‌మెట్ సైనిక్‌పురి భారతీయ విద్యా భవన్ భవన్స్ వివేకానంద కళాశాలలో డిసెంబర్ 30,31న నిర్వహించిన యువ మహోత్సవాలలో భాగంగా రెండవ రోజు విద్యార్థుల ఆటపాటలతో కళాశాల మార్మోగింది. డాన్స్ లో మొత్తం 70 మం ది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభ లను ప్రదర్శించారు. అందులో భాగంగా ఆర్ట్ ఎగ్జిబిషన్ కార్యక్రమం నిర్వహించిన ట్లు పేర్కొన్నారు . ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి ఎస్ వి ఆర్ కె చౌదరి మాట్లాడుతూ నేటి విద్యార్థు లకు విద్యతో పాటు భారతీయ సంస్కృతిని గురించి కూడా తెలుసుకోవడం ఎంతో అవసరమని చెప్పారు. కళ లో మనిషి మనసును మార్చే శక్తి ఉందని చెప్పారు. అనంతరం యువ మహోత్సవం-" రంగస్థలం కార్యక్రమంలో గెలుపొం దిన విద్యార్థిని విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపల్ బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్య క్రమం లో కళాశాలలోని అన్ని విభాగాల అధ్యక్షులు, యువ మహోత్సవ ప్రధాన కోఆరి ్డనేటర్ అయిన దివ్య రేఖ గారు, ఇండియన్ హెరిటేజ్ అండ్ కల్చర్ కోఆర్డినేటర్ మీనా రాణి తదితరులు పాల్గొన్నారు.

## హరిహర క్షేత్రానికి మర్రి నర్సింహారెడ్డి రూ.1.51 లక్షల విరాళం



హరిహర క్షేత్రానికి విరాళం అందజేసిన మర్రి నర్సింహారెడ్డి గురుస్వామి

**సరూర్‌నగర్, డిసెంబరు 31 ప్రభాతవార్త:** శబరిమలై అయ్యప్ప స్వామి కొలువు దీరిన కర్మన్‌ఘాట్ రింగ్‌రోడ్డులోని శ్రీ హరిహ రక్షేత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో నిత్యాన్న ప్రసాద వితరణ నిమిత్తం శాశ్వత దాతగా బాలాపూర్ మండలం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్‌కు చెందిన భాగ్యనగర్ రైతు సేవా సహకార సంఘం (సింగిల్ విండో) ఛైర్మన్ మర్రి నర్సింహారెడ్డి గురుస్వామి రూ.1.51 లక్షలను విరాళంగా అందజేశారు. ఈ విరాళం మొత్తాన్ని ఆయన నగదు రూపంలో హరిహర క్షేత్రం మేనేజర్‌కు అందజేశారు. ఈ కార్యక్ర మంలో ఆంజనేయులు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## సూర్యగిరి ఎల్లమ్మ దేవాలయానికి రూ.81,116ల విరాళం



విరాళం మొత్తాన్ని అందజేస్తున్న యంపాల ప్రణీత్‌రెడ్డి

**సరూర్‌నగర్, డిసెంబరు 31 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజ కవర్గంలోని చారిత్రక సూర్యగిరి ఎల్లమ్మ దేవస్థానికి ఇబ్రహీం పట్నం కర్ణగూడెం గ్రామానికి చెందిన యంపాల ప్రణీత్‌రెడ్డి రూ.81,116లను విరాళంగా ఇచ్చారు. అయ్యప్ప మాలధారణ చేసి దీక్షలో ఉన్న ప్రణీత్‌రెడ్డి గంట స్వామి మంగళవారం తన కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం విరాళం మొత్తాన్ని ఆలయ సిఇఓతో పాటు ఆలయ నిర్వాహ కుడు కాశీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ సొసైటీ ఛైర్మన్ మర్రి నర్సింహారెడ్డి, యంపాల సధాకర్‌రెడ్డి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల డ్రంక్ డ్రైవ్ తనిఖీలు



బడంగ్‌పేట్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

**సరూర్‌నగర్, డిసెంబరు 31 ప్రభాతవార్త:** కొత్త సంవత్సరం ప్రారంభం అవుతున్న వేళ కొన్ని గంటల ముందు నుండే మీర్‌పే ట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రాంతాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. మందు బాబుల దూకుడుకు కళ్లెం వేసేందుకు పోలీసులు ముందస్తు హెచ్చరికలు చేసిన సంగతి విదితమే. అయితే నూతన సంవత్సరం వేడుకలు, హడావిడి ప్రారంభం కాకముందు మంగళవారం సాయంత్రం నుండే పోలీ సులు తనిఖీలు చేయడం గమనార్హం. ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు సంయుక్తంగా బడంగ్‌పేట్ నుండి నాదర్‌గుల్ వైపు వెళ్లే రహదారి ఆర్‌అండ్‌బి రోడ్డులోనున్న రంగారెడ్డి జిల్లా కేంద్ర గ్రంథాలయం వద్ద అదే విధంగా పలు చోట్ల స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రీత్ అనలైజర్ల ద్వారా వాహ నాదారులకు పరీక్షలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో మద్యం తాగినట్లుగా నిర్ధారించిన వారిపై కేసులు నమోదు చేశారు.

## మహిళ అదృశ్యం

**హయత్‌నగర్, డిసెంబరు 31 ప్రభాతవార్త:** డ్యూటీకి వెళ్లిన మహిళ కనిపి ంచకుండా పోయిన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు... అన్మగల్ హయత్‌నగర్‌కు చెందిన ఎర్రకృష్ణ కుమార్తె శాలిని వనస్థలిపురంలోని సిద్ధార్థ పీజీ కళాశాలలో రిసెప్షనిస్టుగా పనిచేస్తోంది. రోజులాగే ఈనెల 30న ఉదయం 9.30 గంటలకు డ్యూటీకి వెళ్లిన ఆమె సాయంత్రం అయినా ఇంటికి తిరిగి రాలేదు. ఫోన్‌స్విచ్ఛాఫ్ వస్తోంది. దీంతో కళాశాల తో పాటు బంధువులు, స్నేహితులను విచారించినా ఫలి తం లేకపోవడంతో ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## మహేశ్వరం నియోజకవర్గ ప్రజలకు సబితారెడ్డి నూతన సంవత్సరం శుభాకాంక్షలు

**సరూర్‌నగర్, డిసెంబరు 31 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గ ప్రజలకు స్థానిక శాసన సభ్యురాలు, మాజీ మంత్రి పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి నూతన సంవ త్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కొత్త సంవత్సర వేడుకలను ఆరోగ్యపూరిత వాతావరణంలో అందరూ ఆనందోత్సాహాల మధ్య జరుపుకొని నూతన సంవత్స రానికి ఆహ్వానం పలకాలని ఆమె సూచించారు. ఈ కొత్త సంవత్సరంలో అందరికీ శుభాలు కలగాలని, సంతోషాలను ఇవ్వాలని ఆయన ఆకాంక్షించారు. నియో జకవర్గ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా అందరికీ అందు బాటులో ఉంటూ ఈ కొత్త సంవత్సరంలో ఇంకా మెరు గ్గా పని చేస్తామని ఆమె స్పష్టం చేశారు.

## రేపు మేయర్ దంపతుల ఆధ్వర్యంలో బాలాపూర్‌లో అయ్యప్ప పడి పూజ

**సరూర్‌నగర్, డిసెంబరు 31 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో జనవరి 2వ తేదీన అయ్యప్ప పడి పూజో త్సవాన్ని నిర్వహించనున్నారు. గురువారం సాయంత్రం వారి స్వ గ్రామం బాలాపూర్‌లోని నివాసంలో పూజను తలపెట్టారు. ఈ మేరకు అయ్యప్ప స్వాములతో పాటు పలువురిని వారు పూజకు ఆహ్వానించారు.

## ఏఐటీయూసీ ఫ్రూట్‌మార్కెట్ నూతన కార్యకవర్గం



నూతన కార్యవర్గ సభ్యులు

**హయత్‌నగర్, డిసెంబరు 31 ప్రభాతవార్త:** ఏఐటీయూ సీ బాటసింగారం ఫ్రూట్‌మార్కెట్ నూతన కమిటీని మంగళవారం ప్రకటించారు. గౌరవాధ్యక్షులుగా హాజీభా య్, అధ్యక్షులుగా మస్తాన్‌భాయ్, ప్రధాన కార్యదర్శిగా చిన్నగౌడ్, కోశాధికారిగా పోశయ్య, సహాయ కార్యద ర్శిగా శంకర్‌నాయక్‌తో పాటు 12మంది కార్యవర్గ సభ్యు లు, 25 మంది కౌన్సిల్ సభ్యులతో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రంగారె డ్డి జిల్లా ఉపాధ్యక్షులు అజ్మీర హరిసింగ్‌నాయక్, జిల్లా కార్యవర్గ సభ్యులు కేతరాజు నరసింహ పాల్గొన్నారు.

## చెత్తను స్వచ్ఛ ఆటోల్లోనే వేయాలి

**: కొప్పుల నర్సింహారెడ్డి, కార్పొరేటర్**



కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్

**హయత్‌నగర్, డిసెంబరు 31 ప్రభాతవార్త:** చెత్తను రోడ్లపై ఖాళీ స్థలాల్లో వేయకుండా స్వచ్ఛ ఆటోల్లోనే వేయాలని జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి అన్నారు. మార్నింగ్ వాక్‌లో భాగంగా ఆయన వీరభద్రనగర్ కాలనీలో పర్యటించి సమస్యలను తెలుసు కున్నారు. కాలనీలో చెత్తను రోడ్లపైనే వేస్తున్నారని కాలనీవాసులు కౌన్సిలర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయన ఇంటింటికీ తిరిగి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం... ఆరోగ్యాన్ని కాపాడుకుందాం అంటూ చెప్పడం జరిగింది. ఒక మహిళ ఆ ఇంటిలో అద్దెకు ఉండే నాలుగు పోర్షన్లకు సంబంధించిన చెత్తను స్వచ్ఛ ఆటోల్లోనే వేయడానికి డబ్బులు తానే ఇస్తానని చెప్పడంతో కార్పొరేటర్ ఆమెను అభినందించారు. కాలనీ రోడ్లకు ఇరువైపులా చెత్తను వేయడం వల్ల దుర్గం ధం, దోమలు వ్యాపిస్తాయని, ప్రజలు అనారోగ్యం పాలయ్యే ప్రమాదం ఉందన్నారు. కాలనీల్లో చెత్తను ఎప్పటికపుడు సేకరించాలని స్వచ్ఛ ఆటోలకు చెప్పడం తో పాటు రోడ్లపక్కన చెత్తను వేసేవారికి జరిమానా విధిస్తామన్నారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు విజయేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, నరేంద్రరెడ్డి, అల్లయ్య, రాజిరెడ్డి, దశరథ్‌గౌడ్, గాలయ్య పాల్గొన్నారు.

## రక్తదానం అన్ని దానాల్లో కెల్లా గొప్పది : కార్పొరేటర్



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి

**సైదాబాద్, డిసెంబరు 31 ప్రభాతవార్త:** రక్తదానం అన్ని దానాల్లో కెల్లా గొప్పదని లింగోజిగూడ డివిజన్ కార్పొరే టర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని శ్రీరామ్‌నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడు తూ రక్తదానం ఆపదలో ఉన్న వారిని కాపాడుతుం దన్నారు. లింగోజిగూడ డివిజన్‌లోని అన్ని కాలనీలు, బస్తీలలో ఇప్పటికే పలు అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని, మరికొన్ని పనులు కొనసాగుతున్నాయని అన్నారు. డివిజన్ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కందికంటి శ్రీధర్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, వివిధ కాలనీ వాసులు, కాంగ్రె స్ నాయకులు పాల్గొన్నారు.

## నూతన సంవత్సరాదికి సిద్ధమైన కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయం



**సైదాబాద్, డిసెంబరు 31 ప్రభాతవార్త:** చారిత్రక నేప థ్యం కలిగిన ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయం ఆంగ్ల నూతన సంవత్సరాదికి సిద్ధమైంది. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని భక్తులు పెద్ద ఎత్తున దేవాలయానికి తరలివచ్చే అవకాశ మున్నందున దేవాలయంలో తగిన ఏర్పాట్లు చేస్తున్నా రు. భక్తుల తాకిడిని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేకంగా క్యూ లైన్లు, టెంట్లు ఏర్పాటు చేస్తున్నారు. కార్యనిర్వా హణాధికారి లావణ్య దేవాలయంలో ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు చేశారు.

## ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు : ఎమ్మెల్యే



**మల్కాజిగిరి, డిసెంబర్ 31 ప్రభాతవార్త :** మల్కాజిగిరి శాసన సభ్యులు మర్రి రాజశేఖర్‌రెడ్డి నూత న సంవత్సరం సం దర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ము ఖ్యంగా మల్కాజిగిరి నియోజక వర్గ ప్రజలందరికీ హృదయపూర్వక శుభా కాంక్షలు తెలిపారు.మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణవాసులు, దేశవిదేశాలలో స్థిరపడిన, నివసిస్తు న్న తెలంగాణ బిడ్డలందరికి నూతన సంవత్సర శుభా కాంక్షలు చెప్పారు.నూతన సంవత్సరం-2025 ఆరం భం సందర్భంగా వేడుకలను ప్రశాంతంగా, ఆనందంగా, ఎటువంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా జరుపుకో వలసిందిగా,మద్యంసేవించి వాహనాలు నడుపొద్దని యువతకు శ్రీ మర్రి రాజశేఖర్ రెడ్డి ఉద్బోధించారు.కొత్త ఆలోచనలు, ఆకాంక్షలు,సుస్పష్టమైన లక్ష్యాన్ని ఎంచు కుని క్రమశిక్షణ, నిబద్ధత,పట్టుదలతో ముందుకు సాగు తూ జీవితంలో ఉన్నతంగా ఎదగాలని ఎంపీ వద్దిరాజు యువతను కోరారు.కొత్త సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రం పాడిపంటలతో తులతూగాలని, ప్రజలందరూ సుఖ సంతో షాలతో వర్ధిల్లాలని మర్రి రాజశేఖర్‌రెడ్డి అభిలషించారు.

## మల్లాపూర్‌లో ఘనంగా క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలు



క్రిస్మస్ కేక్‌ను కట్ చేస్తున్న కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి

**నాచారం, డిసెంబర్ 31 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వ ఆద్వర్యంలో మల్లాపూర్‌లో ఏర్పాటు చేసిన క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలకు ముఖ్య అతిథులుగా మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి హాజరై క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి క్రైస్తవులకు క్రిస్మస్‌తో పాటు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ క్రైస్తవులు ఐక్యతగా ఉండాలి దేశం కొరకు రాష్ట్రం కొరకు ప్రార్థన చేయాలని విజ్ఞప్తి చేశారు. అందరూ బాగుండాలి అందులో మనం అందరం ఉండాలని ప్రజలకు తెలిపారు ప్రజలు క్షేమాభి వృద్ధి కొరకు క్రైస్తవుల అభివృద్ధి కొరకు నిత్యము సహకా రిగా ఉంటానని హామి ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సద్గుణ రావు,రెవరెండ్. తిమోతి ,సామ్యూల్, రంగారా వు,రత్నరాజు, శాంతరాజు, ఆదం రాజు ,స్టీఫెన్ కృపా దానం,ఎస్ జాన్, అనిల్ పాస్టర్లు పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్‌లో పోలీసుల గస్తీ పెంచాలని వినతి



ఉప్పల్ సిఐ ఎలక్షన్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న రాజేంద్రనగర్ కాలనీవాసులు

**ఉప్పల్, డిసెంబరు 31 ప్రభాతవార్త :** రామంతాపూర్ రాజేంద్రనగర్‌లో పోలీసుల గస్తీ పెంచాలని పలువురు కాలనీవాసులు మంగళవారం పోలీసులకు విన్నవించా రు. ఈ మేరకు కాలనీ సంఘం నేతలు వేముల తిరుప తయ్య, వెంకటేశ్వర్లు, రాజేష్, ఈశ్వర్‌రావు, రాజేష్, భాస్కర్, సావిత్రి, పద్మ,గౌరి, సుశీల తదితరులు ఉప్పల్ సిఐ ఎలక్షన్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజే శారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లా డుతూ రాజేంద్రనగర్‌లో గత కొద్ది రోజులుగా బైక్ దొంగ తనాలు పెరిగాయని, బైక్‌లలో పెట్రోల్ దొంగతనం చేస్తున్నారని తెలిపారు. అర్ధరాత్రి వేళ పోకిరీలు ఇబ్బందులకు గురిచేస్తున్నారని, కాలనీలో పెట్రోలింగ్ పెంచాలని వారు కోరారు. దీనిపై సిఐ ఎలక్షన్‌రెడ్డి స్పందిస్తూ పోలీసులు నిరంతరం కాలనీలలో తిరుగుతు న్నారని, ఏదైనా అత్యవసర సమస్య ఉంటే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు.

## అభయాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి విరాళం



ఆలయ అభివృద్ధి కోసం నగదు అందజేస్తున్న రాజేందర్ యాదవ్

**తార్నాక, డిసెంబర్ 31 ప్రభాతవార్త :** హబ్సిగూడ జెన్ ప్యాక్ సమీపంలో ఉన్న అభయాంజనేయ స్వామి దేవాలయ అభివృద్ధి కోసం సీనియర్ నాయకులు ర్యాల రాజేందర్ యాదవ్ ర్యాల అడవయ్య ట్రస్ట్ ఆద్వర్యంలో రూ. 20వేల విరాళాలన్ని అందజే శారు. ఆలయ కమిటీ వారికి రాజేందర్ యాదవ్ అందజేశారు. ఎంతో మహిమకల్గిన ఈ ఆలయ అభివృద్ధి కోసం అవసరమైతే ఇంకా విరాళం ఇచ్చేందుకు సిద్దంగా ఉన్నానని రాజేందర్ యాదవ్ పేర్కొన్నారు.

## ఘనంగా స్ఫూర్తి డిగ్రీ కళాశాల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



స్ఫూర్తి డిగ్రీ కళాశాల గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, డిసెంబరు 31 ప్రభాతవార్త :** విద్యార్థులు అన్ని రంగా ల్లో రాణించేందుకు తన వంతు సహకారం అందిస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళ వారం స్ఫూర్తి డిగ్రీ కళాశాల గ్రాడ్యుయేషన్ వేడుకలకు ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్ర మంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి సమా జానికి, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకుని రావాలని సూచించారు. ఉన్నత చదువులు చదుకున్న వారికి స్కాలర్‌షిప్ లు, విదేశాలకు వెళ్లే వారికి చేయూత అందిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న వారికి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి చేతుల మీదుగా సర్టిపికేట్లు పంపిణీ చేశారు. లీలా వినోదం నటులు మజ్జి మధన్, మిర్చి ఆర్‌జె శ్రవణ్, చిట్టిపొట్టి చిత్రం గాయని పి.నాగ ప్రత్యూష తమ ప్రదర్శ నలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ రావ ర్తి సురేష్‌గౌడ్, ప్రిన్సిపల్ జ్యోష్న, అనిత, మానస, శిరీష్మ, బిఆ ర్ఎస్ రాష్ట్ర నాయకులు పసుల ప్రభాకర్‌రెడ్డి, బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సాయిజెన్ శేఖర్, ప్రశాంత్‌గౌడ్, బోసాని పవన్, సూరం శంకర్, జహంగీర్, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

## కురుమలకు చేయూత అందిస్తా : పరమేశ్వర్‌రెడ్డి



కాంగ్రెస్ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డితో బేటి అయిన రామంతాపూర్ కురుమ సంఘం నేతలు

**ఉప్పల్, డిసెంబరు 31 ప్రభాతవార్త :** కురుమ కులస్థులకు అన్ని రంగాల్లో తన వంతు చేయూత అందిస్తానని ఉప్పల్ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి పేర్కొ న్నారు. ఈ మేరకు నూతనంగా ఎన్నికైన రామంతాపూర్ కురుమ సంఘం, బీరప్ప దేవాలయం కమిటి, ఎల్లమ్మ దేవాలయం కమిటి, కురుమ యూత్ కమిటి నేతలను ఆయనను కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కురుమ కులస్థులు రాజకీయంగా, ఆర్థికంగా రాణిం చాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ కురుమలకు తగు ప్రాధాన్య త ఇస్తుందన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన నేతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం నేతలు రావుల జంగయ్య, రేవు కృష్ణయ్య, శాగ శ్రీధర్, బండ అంజయ్య, శాగ శ్రీనివాస్, రవీందర్, కవిడే శ్రీశైలం,బాలం బిక్ష పతి, రేవు పరందామ, రేవు బీరప్ప, కె.వెంకటేష్, యాదయ్య, శ్రీధర్, బాలం శ్రీనివాస్,రావుల మహేష్ పాల్గొన్నారు.

## రమేష్‌గౌడ్ ఆశయ సాధనకు కృషి చేయాలి : సామ రంగారెడ్డి



రమేష్ గౌడ్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న సామ రంగారెడ్డి, ఆకుల అఖిల్‌గౌడ్ తదితరులు

**సైదాబాద్, డిసెంబరు 31 ప్రభాతవార్త:** దివంగత ఆకుల రమేష్‌గౌడ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా అర్బన్ బిజెపి అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. ఎల్‌బినగర్ మున్సిపాలిటి మాజీ చైర్మన్ ఆకుల రమేష్ గౌడ్ వర్ధంతి సందర్భంగా లింగోజిగూడ డివిజన్‌లోని లిబర్టీ చౌరస్తా వద్ద కంటెస్టెడ్ కార్పొరేటర్ ఆకుల అఖిల్‌గౌడ్ ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని రమేష్ గౌడ్ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా సామ రంగారెడ్డి మాట్లాడుతూ ఆకుల రమేష్‌గౌడ్ మున్సిపల్ ఛైర్మన్‌గా ఉన్న సమయంలో ఎల్‌బినగర్‌ను అభివృద్ధి పథంలో నడిపించారని అన్నారు. ఈ కార్యక్రమంలో కొత్త రవీందర్‌గౌడ్, కళ్లెం రవీందర్‌రెడ్డి, విజయభాస్కర్, గుండా కిరణ్, బోస్లె శ్రీనివాస్, రామ్మోహన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల కారాగార శిక్ష

**హుడా కాంప్లెక్, డిసెంబరు 31, ప్రభాత వార్త:** సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో, ఒక మైనర్ బాలికను ప్రేమ పేరుతో మభ్యపెట్టి, అపహరించి లైంగిక దాడికి పాల్పడిన నిందితునికి రంగారెడ్డి జిల్లా కోర్టు 20 ఎండ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. వివరాల్లోకి వెళితే విష్ణుపురి కాలనీ చంపాపెట్ లో ఉంటున్న, నల్గొండ జిల్లాకు చెందిన వరికుప్పల మహేష్ ఒక మైనర్ 5బాలికను ప్రేమ పేరుతో మభ్యపెట్టి అపహరించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. వసరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఈ కేసులో అత్యాచారం మరియు పోక్సో చట్టం ప్రకారం రంగా రెడ్డి జిల్లా, ఎల్.బి.నగర్‌లోని గౌరవ ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక న్యాయ మూర్తి నిందితుడిని దోషిగా నిర్ధారించారు. ఈ కేసులో నిందితు డికి 20 ఏళ్ళ కఠిన కారాగార శిక్ష మరియు రూ.25,000/ జరి మానా విధించబడింది మరియు బాధితురాలికి రూ.5,00,000/ పరిహారం అందించబడింది. ఈ కేసులో అదనపు పబ్లిక్ ప్రాసి క్యూటర్ శ్రీమతి సునీత గారు వాదనలు వినిపించారు.